తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
బుధవారం
2 సెప్టెంబర్ 2026
పేజీలు : 08
Follow :



కీసర మండలం రాంపల్లి దాయరలో అనుమతులు లేకుండా మట్టి, మొరం తవ్వకాలు, బ్లాస్టింగ్‌లు కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. మూడు టిప్పర్లను సీజ్ చేసినా తవ్వకాలు ఆగలేదని, అక్రమ విద్యుత్ వినియోగంపైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# రాంపల్లి దాయరలో ఆగని అక్రమ తవ్వకాలు

## దొంగ విద్యుత్‌తో బ్లాస్టింగ్‌లు.. మట్టి మాఫియా దందా

### నామమాత్రపు చర్యలతో మళ్లీ మొదలైన తవ్వకాలు





**కీసర, సెప్టెంబర్ 01 (జనంసాక్షి) :** కీసర మండలంలోని రాంపల్లి దాయర కేఎల్ఆర్ ఇండస్ట్రియల్ ప్రాంతంలో అక్రమ మట్టి తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా కొండలను తవ్వుతూ, బండరాళ్లను పేల్చి మట్టి తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సమీప వ్యవసాయ పొలాల నుంచి అక్రమంగా విద్యుత్ వినియోగిస్తూ కంప్రెషర్లు, ఇతర యంత్రాలను నడుపుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. సర్వే నంబర్లు 633, 639 పరిధిలో భారీ ఎత్తున మట్టి, మొరం తవ్వకాలు జరుగుతున్నాయని చెబుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా బ్లాస్టింగ్‌లు నిర్వహించడంతో పెద్ద ఎత్తున శబ్దాలు వస్తుండటంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, రైతులు భయాందోళనకు గురవుతున్నట్లు పేర్కొంటున్నారు.

ఇటీవల రెవెన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించి అక్రమ రవాణా చేస్తున్న మూడు టిప్పర్‌లను మాత్రమే సీజ్ చేశారు. అయితే ఘటనాస్థలంలో ఉన్న హిటాచీలు, కంప్రెషర్లు, ఇతర యంత్రాలపై చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పూర్తిస్థాయిలో చర్యలు లేకపోవడంతో తవ్వకాలు మళ్లీ యథావిధిగా ప్రారంభమయ్యాయని ఆరోపిస్తున్నారు.

స్థానికుల ఫిర్యాదుల మేరకు రెవెన్యూ అధికారులు మరోసారి ఘటనాస్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. తవ్వకాలు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్ ను ఫోన్‌లో సంప్రదించి హెచ్చరించినట్లు సమాచారం.

అక్రమ మట్టి తవ్వకాలు, విద్యుత్ చౌర్యంపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

# అక్టోబర్ చివరి నాటికి భూసేకరణ పూర్తి చేయాలి

- కొడంగల్ ప్రాజెక్టులపై సమీక్షించిన ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్
- రైతులతో సమావేశాలు నిర్వహించి సమ్మతి తీసుకోవాలి




# ఓబీసీ రిజర్వేషన్లలో కచ్చితమైన కేటాయింపు చేయాలి

- మహిళా కోటాలో ఓబీసీలకు ఉపకోటా కల్పించాలి
- 2027 జనగణనలో ఓబీసీలకు ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయాలి
- కేంద్రానికి 15 రోజుల అల్టిమేటం జారీ చేసిన లోక్ ఆందోళన్ న్యాస్




**ముషీరాబాద్, సెప్టెంబర్ 1 (జనంసాక్షి):** ఓబీసీ రిజర్వేషన్లలో కచ్చితమైన కేటాయింపు, 33 శాతం మహిళా రిజర్వేషన్లలో ఓబీసీలకు ఉపకోటా, 2027 జనగణనలో ఓబీసీల మిగతా 2లో..




2

# అనధికార నిర్మాణాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ స్పెషల్ డ్రైవ్

- మూడు జోన్లలో 36 నిర్మాణాలు గుర్తింపు.. 26 భవనాల కూల్చివేత
- 10 నిర్మాణాలకు నోటీసులు.. ఒక నిర్మాణం సీజ్

## రూ.1,500 కోట్ల నిధుల

# సమీకరణకు గ్రీన్ సిగ్నల్?

- ఎంఎంసి స్టాండింగ్ కమిటీలో కీలక ప్రతిపాదనల పరిశీలన
- ఇందిరమ్మ క్యాంటీన్లు.. మౌలిక వసతులకూ ప్రాధాన్యం
- ఎంఎంసి స్టాండింగ్ కమిటీ సమావేశంలో 20 ప్రతిపాదనలపై చర్చ




**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 01 (జనంసాక్షి) :** అభివృద్ధి, పారిశుద్ధ్యం, ప్రజారోగ్యం, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, ఆర్థిక, పరిపాలనా విభాగాలకు సంబంధించిన 20 ప్రతిపాదనలను కమిటీ పరిశీలించింది. మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) స్టాండింగ్ కమిటీ సాధారణ సమావేశం మంగళవారం తార్నాకలోని ప్రధాన కార్యాలయంలో ఎంఏయూడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఎంఎంసి మిగతా 2లో..

# రూ.1,500 కోట్ల నిధుల సమీకరణకు గ్రీన్ సిగ్నల్?

ఎంఎంసి స్టాండింగ్ కమిటీ సమావేశంలో 20 ప్రతిపాదనలపై చర్చ స్పెషల్ ఆఫీసర్ జయేష్ రంజన్ అధ్యక్షతన నిర్వహించారు. మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి పనులు, పౌర సౌకర్యాల విస్తరణ, పారిశుధ్య నిర్వహణకు సంబంధించిన కీలక అంశాలపై స్టాండింగ్ కమిటీ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'ఇందిరమ్మ క్యాంటీన్' కార్యక్రమం ద్వారా పేదలు, అవసరమైన వారికి తక్కువ ధరలో ఆహారం అందించేందుకు నిధుల మంజూరు అంశాన్ని కమిటీ పరిశీలించింది.

అదే విధంగా స్వచ్ఛ భారత్ మిషన్ (అర్బన్) 2.0 కింద అవగాహన కార్యక్రమాల (ఐఈసీ) అమలుకు సంబంధించిన ప్రతిపాదనలపై చర్చించి నిర్ణయాలు తీసుకుంది. చికెన్ వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో సేకరణ, రవాణా, నిర్మూలనకు సంబంధించి ప్రత్యేక చర్యలు చేపట్టాలని నిర్ణయించింది.

**ముఖ్య నిర్ణయాలు..**

- ఇందిరమ్మ క్యాంటీన్ల నిర్వహణకు నిధుల మంజూరు ప్రతిపాదన పరిశీలన
- ఎస్‌బీఎం (యూ) 2.0 కింద ఐఈసీ కార్యక్రమాల అమలుపై చర్చ
- చికెన్ వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణకు చర్యలు
- ఏబీసీ, ఏఆర్‌వీ కార్యక్రమాల అమలుకు ఎన్‌జీఓలు, అనిమల్ వెల్ఫేర్ సంస్థల ద్వారా టెండర్ల నిర్వహణ
- పౌర సౌకర్యాల అభివృద్ధికి రూ.1,500 కోట్ల వరకు నిధుల సమీకరణ ప్రతిపాదన
- భూసేకరణకు సంబంధించిన అంశాల పరిశీలన
- వివిధ ప్రాంతాల్లో ఆర్‌సీసీ బాక్స్ డ్రైన్లు, సీసీ రోడ్లు, ఫుట్‌పాత్‌ల నిర్మాణానికి పరిపాలనా అనుమతులు

**అభివృద్ధి పనులకు ప్రాధాన్యం**

ఉప్పల్ ప్రాంతంలోని పలు లేఅవుట్లలో ఫుట్‌పాత్‌ల అభివృద్ధి, ఆల్వాల్ జొన్నబండలోని వీబీఆర్ గార్డెన్స్ నుంచి ఎన్‌హెచ్-44 వరకు రహదారి అభివృద్ధి, చిలుకా లేఅవుట్‌లో ప్రత్యేక పార్కింగ్ కోసం భూమి కేటాయింపు వంటి టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ అంశాలు కూడా సమావేశంలో చర్చకు వచ్చాయి. అలాగే ఉప్పల్ డెవలప్‌మెంట్ మోడల్ రోడ్డు పనులు, బస్ ట్రాన్సిట్‌కు సంబంధించిన మౌలిక సదుపాయాల అభివృద్ధి, రామంతాపూర్‌లో మోడల్ రోడ్ నిర్మాణ ప్రతిపాదనలను కమిటీ పరిశీలించి తదుపరి చర్యలకు ఆమోదం తెలిపింది.

సమావేశంలో స్పెషల్ ఆఫీసర్ జయేష్ రంజన్‌తో పాటు ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, జోనల్ కమిషనర్లు రాధికా గుప్తా, సంచిత్ గంగ్వార్, వికాస్ మహతో, అదనపు కమిషనర్లు రఘు ప్రసాద్, వేణుగోపాల్, సెక్రటరీ రజిని, చీఫ్ సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ రావు, యూబీడీ డైరెక్టర్ సునంద, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

## అనధికార నిర్మాణాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ స్పెషల్ డ్రైవ్

**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 1 (జనంసాక్షి):** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) పరిధిలో అనధికార నిర్మాణాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మంగళవారం మూడు జోన్ల పరిధిలో క్షేత్రస్థాయి తనిఖీలు చేపట్టి అనధికార నిర్మాణాలను గుర్తించి చర్యలు తీసుకున్నారు. ఈ తనిఖీల్లో మొత్తం 36 అనధికార నిర్మాణాలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. వీటిలో 26 నిర్మాణాలను కూల్చివేశారు. మరో 10 నిర్మాణాలకు నోటీసులు జారీ చేశారు. ఒక అనధికార నిర్మాణాన్ని సీజ్ చేశారు. మిగిలిన కేసుల్లోనూ తదుపరి కూల్చివేతలు, ఇతర ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలను నిర్దేశిత విధానం, అమలులో ఉన్న నిబంధనల ప్రకారం చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు. మూడు జోన్ల పరిధిలో చేపట్టిన కూల్చివేతల్లో శేరిలింగంపల్లి జోన్‌లో 8, కూకట్‌పల్లి జోన్‌లో 7, కుత్బుల్లాపూర్ జోన్‌లో 11 నిర్మాణాలను కూల్చివేసినట్లు ఉన్నతాధికారులు వివరించారు. సీఎంసీ పరిధిలో అనధికార నిర్మాణాలపై ప్రతిరోజూ క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహిస్తూ కఠిన పర్యవేక్షణ కొనసాగించాలని టౌన్ ప్లానింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను సీఎంసీ కమిషనర్ డాక్టర్ జి. సృజన ఆదేశించారు. భవన నిర్మాణ నిబంధనల అమలును కచ్చితంగా నిర్ధారించేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలను నిరంతరం కొనసాగిస్తామని అధికారులు తెలిపారు.

## అక్టోబర్ చివరి నాటికి భూసేకరణ పూర్తి చేయాలి



**కొడంగల్, సెప్టెంబర్ 1 (జనంసాక్షి):** కొడంగల్ నియోజకవర్గ పరిధిలో చేపట్టిన కొడంగల్ ఎత్తిపోతల పథకం, ఇండస్ట్రియల్ పార్క్, రేడియల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను అక్టోబర్ చివరి నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కొడంగల్‌లోని కడా కార్యాలయంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, నారాయణపేట జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక, రెవెన్యూ అధికారులు, డీఆర్వోలతో కలిసి మూడు ప్రాజెక్టుల భూసేకరణ, పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నందున నిర్ణీత గడువులోగా భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని శ్రీధర్ స్పష్టం చేశారు. భూములు కోల్పోయే రైతులతో సమావేశాలు నిర్వహించి వారి సమ్మతి తీసుకోవడంతో పాటు, ప్రాజెక్టుల వల్ల కలిగే ప్రయోజనాలను వారికి వివరించాలని సూచించారు. భూములు కోల్పోయే రైతులకు నిబంధనల ప్రకారం పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

భూసేకరణలో జాప్యంపై అధికారులను ప్రశ్నించిన శ్రీధర్, వికారాబాద్ జిల్లాలో ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ దీపక్ తివారిని ఆదేశించారు. అనంతరం ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, పబ్లిక్ హెల్త్, హౌసింగ్, మిషన్ భగీరథ తదితర శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఉమాశంకర్ ప్రసాద్, వెంకటాచారి, నారాయణపేట అదనపు కలెక్టర్ శ్రీనివాస్, అడిషనల్ ఎస్పీ రాజేష్ మీనా, ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూర్, కడా అభివృద్ధి అధికారి వెంకట్‌రెడ్డి, జిల్లా, మండల స్థాయి అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

# విలీనం చేసే వరకు పోరాటం కొనసాగుతుంది

- **భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఫ్యూచర్ సిటీలో మహేశ్వరం మండలాన్ని కలపాలి**
- **ఫ్యూచర్ సిటీ జేఏసీ చైర్మన్ రఘుపతి**



**మహేశ్వరం,సెప్టెంబర్1(జనంసాక్షి):** భారత్ ఫ్యూచర్ సిటీలో మహేశ్వరం మండలాన్ని విలీనం చేసే వరకు పోరాడుతామని ఫ్యూచర్ సిటీ జేఏసీ చైర్మన్ రఘుపతి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మంగళవారం ఫ్యూచర్ సిటీ జేఏసీ నాయకులు మహేశ్వరం తహసిల్దార్ కార్యాలయం ఎదుట రెండవ రోజు రిలే నిరాహార దీక్ష చేపట్టారు.దీక్ష చేపడుతున్న జేఏసీ నాయకులకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి,మహేశ్వరం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు జగన్ రెడ్డి, టీడబ్ల్యూజేఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు తడక నర్సింహ,పలువురు జర్నలిస్టులు,ప్రజా సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీ జేఏసీ చైర్మన్ రఘుపతి మాట్లాడుతూ... ఫ్యూచర్ సిటీలో మహేశ్వరం మండలం కలపడం వల్ల ఐటి పరిశ్రమలు,విద్య, వైద్యం, స్పోర్ట్స్ సిటీ, స్కిల్ యూనివర్సిటీ, రియల్ ఎస్టేట్ రంగాలు అభివృద్ధి చెంది స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు.మహేశ్వరం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలను ఫ్యూచర్ సిటీలో విలీనం చేస్తే మహేశ్వరం మండలం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. భవిష్యత్ తరాలకు గొప్ప నగరాన్ని అందించినవారమవుతామన్నారు. ఫ్యూచర్ సిటీ ఏర్పాటుపై కొన్ని రాజకీయ శక్తులు తప్పుడు ప్రచారాలు చేస్తూ ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ గౌరవ అధ్యక్షుడు మనోహర్, ప్రధాన కార్యదర్శి దత్తు నాయక్, సలహాదారుడు జగన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కాకి ఈశ్వర్ ముదిరాజ్,బీజేపీ నాయకులు పోతర్ల సుదర్శన్ యాదవ్,లాజర్, షేక్ హాజీ బాబా, పరిగి రాఘవేందర్ రెడ్డి, విట్టల్ నాయక్, మల్లేష్ ముదిరాజ్, జంగయ్య ముదిరాజ్,కర్రోల్ల రాములు ముదిరాజ్,దోమ శ్రీనివాస్ రెడ్డి, హరికృష్ణ ముదిరాజ్, శ్రీకాంత్ ముదిరాజ్, ఇర్షద్,అఖిలపక్ష, ప్రజా సంఘాల నాయకులు,పలువురు జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

## హాజీపూర్ లో మానవత్వం చాటిన మాజీ సర్పంచ్.

**బాధిత కుటుంబానికి ఐదువేల ఆర్థిక సాయం.**

**యాలాల సెప్టెంబర్ 1 ( జనంసాక్షి ) :** లహాజీపూర్ గ్రామంలో గురు బాలమణి మరణించగా ఆమె భర్త గురు మొగులప్పకు దహన సంస్కారాల నిమిత్తం మాజీ సర్పంచ్ ఒంగోనిబాయి శ్రీనివాస్ రూ.5వేల ఆర్థిక సాయం అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవి ఉన్నా లేకున్నా తన సేవను నిరంతరం కొనసాగిస్తానని తెలిపారు. హాజీపూర్ గ్రామంలో ఏ పేదింటిలో ఎవరు మరణించినా దహన సంస్కారాలకు రూ.వేలు, అలాగే పేదింటిలో పెళ్లి జరిగితే పుస్తెమెట్టెలు అందిస్తూనే ఉంటానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ రచారి రాజు, ఇస్మాయిల్, పెంద్యాల శ్రీనివాస్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఓబీసీ రిజర్వేషన్లలో కచ్చితమైన కేటాయింపు చేయాలి

- **మహిళా కోటాలో ఓబీసీలకు ఉపకోటా కల్పించాలి**
- **2027 జనగణనలో ఓబీసీలకు ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయాలి**
- **కేంద్రానికి 15 రోజుల అల్టిమేటం జారీ చేసిన లోక్ ఆందోళన్ న్యాస్**



**ముషీరాబాద్, సెప్టెంబర్ 1 (జనంసాక్షి):** వివరాల కోసం ప్రత్యేక కాలమ్ ఏర్పాటు, న్యాయవ్యవస్థలో పారదర్శకత తదితర డిమాండ్లను పరిష్కరించాలని లోక్ ఆందోళన్ న్యాస్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ అంశాలపై చర్యలు తీసుకునేందుకు కేంద్రానికి 15 రోజుల గడువు విధించింది.

ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ధర్నాచౌక్‌లో లోక్ ఆందోళన్ న్యాస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్పనా ఇనామదార్ నాయకత్వంలో 'లోక్ తాంత్రిక్ న్యాయ్ అభియాన్' ఆధ్వర్యంలో భారీ నిరసన సభ నిర్వహించారు. తమ డిమాండ్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రధాన మంత్రికి సమగ్ర వినతిపత్రాన్ని పోస్టు ద్వారా పంపించారు. కార్యక్రమంలో మాజీ ఐఏఎస్ అధికారి కమల్‌నాథ్ తావరి, బాంబే హైకోర్టు అడ్వకేట్ శిల్పా మడ్కీ-పవార్, అడ్వకేట్ అశ్వాక్, తెలంగాణ రక్షణ సేన జాతీయ ప్రతినిధి ఆకాష్ కొల్లూరుతో పాటు పలువురు న్యాయ నిపుణులు, ప్రముఖులు పాల్గొని మాట్లాడారు.

జనగణనలో ఓబీసీలకు ప్రత్యేక కాలమ్ అవసరం

2027 జనగణనలో ఓబీసీలకు ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయకపోతే భవిష్యత్తులో రిజర్వేషన్ల అమలుకు అవసరమైన సమగ్ర సమాచారం అందుబాటులో ఉండదని నాయకులు పేర్కొన్నారు. ఓబీసీల జనాభా, సామాజిక పరిస్థితులకు సంబంధించిన కచ్చితమైన గణాంకాలు అందుబాటులోకి రావడానికి జనగణనలో ప్రత్యేక వివరాలను నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా 33 శాతం మహిళా రిజర్వేషన్లలో ఓబీసీలకు ఉపకోటా కల్పించాలని కోరారు. ఉపకోటా లేకుండా మహిళా రిజర్వేషన్ల అమలు చేస్తే అణగారిన వర్గాలకు చెందిన మహిళలకు తగిన ప్రాతినిధ్యం దక్కకపోయే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు.

**దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలు కాపాడాలి**

తెలంగాణ రక్షణ సేన నాయకత్వం కూడా ఓబీసీ రిజర్వేషన్లు, మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ ఉపకోటా, దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడేలా నియోజకవర్గాల పునర్విభజన తదితర అంశాలపై పోరాటం కొనసాగిస్తోందని నాయకులు తెలిపారు. పార్లమెంటులో తెలంగాణకు ప్రస్తుతం ఉన్న సీట్ల వాటా తగ్గకుండా, రాష్ట్రానికి మరింత ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

దేశంలోని అన్ని రాష్ట్రాలకు శాసన వ్యవస్థలో సముచిత ప్రాధాన్యం కల్పించే విధానాలపై నిపుణులతో సమగ్ర అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ అంశాలపై సెప్టెంబర్ 16, 2026లోగా చర్యలు తీసుకోవాలని 15 రోజుల గడువు విధించారు. గడువులోగా కేంద్రం స్పందించకపోతే దేశవ్యాప్తంగా మరింత తీవ్రస్థాయిలో నిరసన కార్యక్రమాలు చేపడతామని, వాటి షెడ్యూల్‌ను అనంతరం ప్రకటిస్తామని లోక్ ఆందోళన్ న్యాస్ నాయకులు వెల్లడించారు.

# చేవెళ్లలో హాస్టల్ నిర్మాణ జాప్యంపై విద్యార్థుల గళం

- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ ధర్నా
- డిమాండ్లు నెరవేర్చకపోతే నిరవధిక దీక్షలు చేపడతామని హెచ్చరిక




**చేవెళ్ల, సెప్టెంబర్ 01 (జనంసాక్షి):** చేవెళ్ల ప్రాంతంలో విద్యార్థుల వసతి గృహాల నిర్మాణంలో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు మంగళవారం ఆందోళన చేపట్టారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని ప్రభుత్వాని కి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. "విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడొద్దు.. వెంటనే హాస్టల్ నిర్మాణం ప్రారంభించాలి" అంటూ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు ఎర్రవల్లి శ్రీనివాస్, కార్యదర్శి బేగరీ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. 2018లోనే ఎస్సీ బాలుర, బాలికల కళాశాల వసతి గృహాలు మంజూరైనప్పటికీ ఇప్పటివరకు నిర్మాణ పనులు ప్రారంభించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఏళ్లుగా హాస్టళ్ల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులకు కనీస వసతి సౌకర్యాలు కల్పించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రస్తుతం విద్యార్థులు సరైన వసతి లేక అద్దె ఇళ్లలో ఉంటూ ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అద్దె గృహాల్లో మౌలిక సదుపాయాల కొరత, భద్రత సమస్యలు, చదువుకు అనుకూలమైన వాతావరణం లేకపోవడంతో విద్యార్థుల విద్యాభ్యాసంపై ప్రభావం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పేద, ఎస్సీ వర్గాలకు చెందిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. హాస్టల్ నిర్మాణ సమస్యపై పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా స్పందన లేకపోవడం దారుణమన్నారు. వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించి, నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని, రోడ్డు దిగ్బంధాలు, భారీ నిరసనలతో పాటు నిరవధిక నిరాహార దీక్షలకు దిగుతామని ఎస్ఎఫ్ఐ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ చేవెళ్ల మండల కార్యదర్శి మాల చందు, విద్యార్థి నాయకులు, కళాశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఢిల్లీ ధర్నాలో తెలంగాణ సీపీఐ నేతలు

### దేశంలో మార్పు రావాలి.. ప్రజా సమస్యలపై ఉద్యమించాలి



**అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 1 (జనంసాక్షి):** 'బద్లావ్ జరూరీ హై.. మార్పు కావాలి' నినాదంతో సీపీఐ జాతీయ కమిటీ పిలుపు మేరకు ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో మంగళవారం నిర్వహించిన భారీ సభలో తెలంగాణ సీపీఐ నేతలు పాల్గొన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారి, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, అజ్మీరా హరిసింగ్ నాయక్, పబ్బతి లక్ష్మణ్, మాధవరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరించి మత రాజకీయాలకు ప్రాధాన్యం ఇస్తోందని విమర్శించారు. ప్రజా ఉద్యమాలను అణచివేయడం సరికాదని, ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. నిత్యావసర ధరలు పెరగడంతో పేద, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రతి పేద కుటుంబానికి ఇల్లు, ఆహారం, ఉపాధి, యువతకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

# ఉద్యోగ,ఉపాధ్యాయులకు పిఆర్సి, ఓపిఎస్ అమలు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తాం

- భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన
- వికారాబాద్ జిల్లా జిపిఓ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మలిగేరి రాజు



**బొంరాస్ పేట, సెప్టెంబర్ 1 (జనం సాక్షి):** రాష్ట్ర ప్రభుత్వం సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపిఎస్ ఓల్డ్ పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ మంగళవారం భోజన విరామ సమయంలో తహసీల్దార్ కార్యాలయం ముందు రెవెన్యూ, పంచాయతీరాజ్ ఉద్యోగులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిపిఓ అసోసియేషన్ వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మలిగేరి రాజు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను స్థానికంగా అమలు చేస్తున్న ఉద్యోగ,ఉపాధ్యాయులకు వెంటనే ఓపిఎస్ ఓల్డ్ పెన్షన్ విధానాన్ని కల్పించాలని, అలాగే ఉద్యోగులకు రావాల్సిన పిఆర్సి అమలు చేయాలని, పెండింగ్ లో ఉన్న ఆరు డిఏలను విడుదల చేయాలన్నారు. ఒకసారి ఎమ్మెల్యే, ఎంపీగా గెలిస్తే జీవితాంతం పెన్షన్ అమలు చేస్తున్న ప్రభుత్వాలు 30, 40 ఏళ్ల సర్వీసు చేసే ఉద్యోగ ఉపాధ్యాయులకు రిటర్మెంట్ తర్వాత పెన్షన్ లేకపోవడం దురదృష్టకరమన్నారు. పిఆర్సి, ఓపిఎస్ అమలు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ చాంద్ పాషా,ఆర్ఐ శిరీష, మండల విద్యాధికారి హరిలాల్, బాకారం మల్లయ్య, బాకారం చంద్రశేఖర్, గౌరారం గోపాల్, జిపిఓలు శ్రీనివాస్ ,సాయిలు, శ్రీకాంత్ ,వెంకటయ్య, మోతీ చందర్ ,కృష్ణ, పంచాయతీ కార్యదర్శులు రాజేష్, నర్సింలు,బసంత్ రెడ్డి, కార్తీక్, అంజిలు, పుష్పలత, శ్రీనివాస్, రవి నాయక్,నరేందర్,చైతన్య రెడ్డి,నాగజ్యోతి, జగదీశ్వరి,సుమలత,హరికాంత్,వందన,గోపాల్, కాశయ్య,బాలరాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు

# రైతులు వానాకాలం పంటల నమోదు చేసుకోవాలి

### యాచారం మండల వ్యవసాయ అధికారి రవినాథ్



**యాచారం, సెప్టెంబర్ 1(జనం సాక్షి ) :** వానాకాలం సీజన్‌లో మండలంలోని రైతులందరూ తమ పొలాల్లో వేసిన పంట వివరాలను సర్వే నంబర్ల ఆధారంగా తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని యాచారం మండల వ్యవసాయ శాఖ అధికారి రవీందర్ తెలిపారు. మీ రెవెన్యూ గ్రామానికి సంబంధించిన వాలంటీర్లు ప్రతి పొలానికి వచ్చి పంట వివరాలను సేకరిస్తారని, వారితో రైతులు సహకరించాలని కోరారు. అలాగే సన్న రకం వరి సాగు చేసిన రైతులు ప్రభుత్వం అందించే మద్దతు పొందేందుకు ఈ క్రింది నియమాలను పాటించాల్సి ఉంటుంది. బయట డీలర్ల దగ్గర సన్న రకం విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు విక్రయం చేసిన డీలర్ వద్దనే తమ వివరాలను ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేయించుకోవాలి. ఒకవేళ ఇంటి వద్ద భద్రపరుచుకున్న సొంత సన్న రకాల వడ్లను నాటిన రైతులు ఉంటే, వారు తమ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారి ని కలిసి సెప్టెంబర్ 10 లోపు వివరాలను రికార్డు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

క్లస్టర్ వారీగా ఏఈఓ ల వివరాలు: యాచారం, మొగుళ్ల వంపు, నందివనపర్తి, మల్కీజ్‌గూడ, అయ్యవారిగూడ, తక్కళ్లపల్లి, తక్కళ్లపల్లి తండా) – సంతోష్ కుమార్ (6305920174); గున్గల్ , గడ్డమల్లయ్యగూడ, చౌదరిపల్లి, మొండి గౌరెల్లి, తులేఖుర్ద్) – గురు ప్రసాద్ (6305920176); మేడిపల్లి, నక్కర్త, కొత్తపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద) – రమేష్ (6305920175); మాల్, నల్లవెల్లి, చింతపట్ల, మంతంగౌడ్, మంతన్ గౌరెల్లి, తమ్మలోనిగూడ నవ్య (6305920177). పంట నమోదు ప్రక్రియలో ఏమైనా సందేహాలు ఉంటే వెంటనే సంబంధిత అధికారులను సంప్రదించాలని కోరారు

# శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ

**శామీర్ పేట, సెప్టెంబర్ 1 (జనం సాక్షి) :** శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్న ప్రసాద వితరణ చేపట్టారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఈసీఐఎల్ కు చెందిన పి .ఎస్. లిథిన్ అదిత్ జన్మదిన సందర్భంగా తల్లిదండ్రులు బి శ్రీనివాస్, పి షర్మిల , వారి కుటుంబ సభ్యులు అన్నదానం చేపట్టారు. ఎల్లమ్మ తల్లి ఆలయానికి విచ్చేసే భక్తులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

# 37 ఏళ్ల సర్వీసు ఉన్న నన్ను అన్యాయంగా తీసేశారు

### మాజీ వీఆర్ఏ అందె జంగయ్య ఆవేదన..మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వినతి



**యాచారం,సెప్టెంబర్ 1(జనం సాక్షి) :** యాచారం మండలం తులేఖుర్దు గ్రామానికి చెందిన మాజీ వీఆర్ఏ అందె జంగయ్య తనకు జరిగిన అన్యాయంపై తెలంగాణ రాష్ట్ర మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ చిలుకల నరసింహకు వినతిపత్రం అందజేశారు. జంగయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఆయన 1980 నుంచి తులేఖుర్దు గ్రామంలో వీఆర్ఏగా సేవలు అందించారు. 2015లో శస్త్రచికిత్స జరగడంతో నాటి పరిస్థితుల దృష్ట్యా తన కుమారుడికి ఉద్యోగం ఇవ్వాలని దరఖాస్తు చేసుకోగా, 2017లో మండల అధికారుల తప్పిదం వల్ల తనకు 65 ఏళ్లు దాటాయనే నెపంతో అక్రమంగా రిటైర్మెంట్ ఇచ్చారని తెలిపారు. అదే సమయంలో 65 ఏళ్లు దాటిన చింతపట్లకు చెందిన మాదరగోని గత్తరయ్య (89), నందివనపర్తికి చెందిన సామ కృష్ణయ్య (75)తో పాటు మరో ఆరుగురు వీఆర్ఏలు ఇప్పటికీ విధుల్లో కొనసాగుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయమై కలెక్టర్, ఆర్డీఓలకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకపోయిందని వాపోయారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి తనకు తిరిగి వీఆర్ఏ ఉద్యోగం కల్పించి, తన కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన కోరారు.

# సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేయాలి

- పెన్షన్ విద్రోహ దినంగా సెప్టెంబర్ 1న ఉద్యోగ, ఉపాధ్యాయుల నిరసన
- టీపీయూఎస్ రాష్ట్ర కార్యదర్శి గణపురం సురధీర్



**చేవెళ్ల, సెప్టెంబర్ 01 (జనంసాక్షి) :** సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) రాష్ట్ర కార్యదర్శి గణపురం సురధీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీపీయూఎస్ పిలుపు మేరకు మంగళవారం సెప్టెంబర్ 1ను పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ కార్యాలయాల్లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా కమ్మెట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గణపురం సురధీర్ మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2004 సెప్టెంబర్ 1 నుంచి కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం (సీపీఎస్) అమల్లోకి వచ్చిందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక భద్రతకు సీపీఎస్ విధానం తీవ్ర నష్టం కలిగిస్తోందని, అందుకే సెప్టెంబర్ 1ను పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తున్నామని తెలిపారు. సీపీఎస్ విధానం ఉద్యోగులకు పదవీ విరమణ అనంతరం ఆర్థిక భరోసా కల్పించడంలో విఫలమవుతోందని ఆయన పేర్కొన్నారు. పాత పెన్షన్ విధానంలో పదవీ విరమణ సమయంలో ఉన్న వేతనంలో సగం మొత్తాన్ని పెన్షన్‌గా పొందే అవకాశం ఉండటంతో పాటు, పెన్షనర్ మరణించిన అనంతరం జీవిత భాగస్వామికి ఫ్యామిలీ పెన్షన్ సదుపాయం ఉంటుందని వివరించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక భద్రతను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ ప్రభుత్వం సీపీఎస్‌ను వెంటనే రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేశ్, బాపురెడ్డి, హరికుమార్, సుధాకర్‌రెడ్డి, శంకర్, విజయరాణి, ప్రవీణ, సరిత పాల్గొన్నారు.



## మైనర్లకు సిగరెట్లు అమ్మితే చర్యలు

### పాన్‌షాపులు, కిరాణా వ్యాపారులకు కీసర పోలీసుల హెచ్చరిక

**కీసర, సెప్టెంబర్ 01 (జనంసాక్షి) :** మైనర్లకు సిగరెట్లు, గుట్కా, ఇతర పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కీసర పోలీసులు హెచ్చరించారు. పాన్‌షాపులు, కిరాణా దుకాణాల నిర్వాహకులకు మంగళవారం కీసర పోలీస్‌స్టేషన్‌లో సీఐ ఆంజనేయులు ఆవేశల మేరకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాపారులు పాటించాల్సిన చట్టపరమైన నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. 18 ఏళ్లలోపు బాలబాలికలకు సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులు, ఇతర నిషేధిత వస్తువులు విక్రయించరాదని స్పష్టం చేశారు. దుకాణాల్లో చట్టవిరుద్ధమైన, నిషేధిత ఉత్పత్తులు విక్రయించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. షాపుల పరిసరాల్లో మాదకద్రవ్యాలు, ఇతర అక్రమ కార్యకలాపాలకు తావివ్వరాదన్నారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ వ్యాపారాలు నిర్వహించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి మైనర్లకు నిషేధిత వస్తువులు విక్రయించినా, అక్రమ ఉత్పత్తుల విక్రయానికి పాల్పడినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా యువతను మాదకద్రవ్యాలు, పొగాకు, ఇతర హానికర పదార్థాలకు దూరంగా ఉంచేందుకు వ్యాపారులు పోలీసులకు సహకరించాలని సీఐ ఆంజనేయులు కోరారు.

## అనాథ యువతి పూజా వివాహానికి కాంగ్రెస్ పార్టీ నాయకుల విరాళాలు

### రూ,25,348/-విరాళం అందజేత



**తలకొండపల్లి(జనంసాక్షి):** మండల పరిధిలోని చుక్కాపూర్ గ్రామానికి చెందిన అనాథ యువతి లక్నమోని పూజా వివాహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు మానవతా దృక్పథంతో ఆర్థిక సహాయం అందించారు. సెప్టెంబర్ 4న తలకొండపల్లి మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో పూజా వివాహం జరగనుంది. ఈ సందర్భంగా తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్ రెడ్డి రూ. 10,116,మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్ రెడ్డి రూ. 10,116,ఆమనగల్ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యాట నరసింహ రూ. 5,116 విరాళంగా అందించారు. మొత్తం రూ. 25,348 ఆర్థిక సహాయం అందించారు. పూజా 12 సంవత్సరాల క్రితం తల్లిదండ్రులను కోల్పోయిన నేపథ్యంలో,ఆమె కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న నాయకులు వివాహ ఖర్చులకు తమవంతు సహాయం అందించారు. అనాథ యువతి వివాహానికి అండగా నిలిచిన కాంగ్రెస్ నాయకులను స్థానిక ప్రజలు అభినందించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,గ్రామ పెద్దలు మాకం. అంజయ్య, శ్రీనివాసులు, కాడిగే. చంద్రకుమార్,కాంగ్రెస్ నాయకులు,వార్డు సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

## తాండూరులో గణేష్ ఆగమన ఊరేగింపులకు అనుమతి లేదు



**తాండూరు సెప్టెంబర్ 1(జనంసాక్షి)**రాబోయే వినాయక చవితి పండుగను పురస్కరించుకొని తాండూరు పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని హిందూ ఉత్సవ నిర్వాహకులకు సీఐ హెచ్చరికలు జారీ చేశారు. వినాయక చవితి సందర్భంగా నిర్వాహకులు గణేష్ ప్రతిమలను కొనుగోలు చేసి తీసుకొస్తున్న క్రమంలో పోలీసులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఆగమనం' పేరుతో ఊరేగింపుగా తీసుకొస్తున్నారని ఆయన తెలిపారు. ఇలా తీసుకొస్తున్న సమయంలో ఎలాంటి ఊరేగింపులకు అనుమతి లేదని స్పష్టం చేశారు. అనుమతి లేకుండా ఊరేగింపు నిర్వహిస్తూ తీసుకొస్తున్న క్రమంలో ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగితే దానికి నిర్వాహకులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కావున ప్రజలందరూ పోలీస్ వారికి సహకరించాలని సీఐ విజ్ఞప్తి చేశారు.

## సర్ ప్రక్రియపై శేరిలింగంపల్లిలో రాజకీయపార్టీల నేతలతో సమావేశం

### ఈఆర్ఓ నారాయణ్ అమిత్ ను నిలదీసిన విపక్షాలు




**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 01 (జనంసాక్షి) :** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్ – 2026) ప్రక్రియను పారదర్శకంగా, అవకతవకలు లేకుండా పూర్తిచేయడమే లక్ష్యంగా శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ ఆధ్వర్యంలో మంగళవారం జోనల్ కార్యాలయ సమావేశ మందిరంలో సర్వపక్ష రాజకీయపార్టీల ప్రతినిధులతో కీలక సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు మరియు వివిధ గుర్తింపుపొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈఆర్వో నారాయణ్ అమిత్ మాట్లాడుతూ నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా మరియు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా చూసేందుకు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఓటర్ల నమోదు, మార్పులు చేర్పులు, చిరునామా మార్పిడి మరియు మరణించిన/వలస వెళ్లిన ఓటర్ల గుర్తింపు ప్రక్రియలో బూత్ స్థాయి ఏజెంట్లద్వారా రాజకీయ పార్టీలు పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు. క్షేత్రస్థాయిలో అందుతున్న ఎన్యూమరేషన్ ఫారాలు డిజిటలైజేషన్ మరియు వెరిఫికేషన్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఈ సందర్భంగా ఈఆర్ఓ ఆదేశించారు.

**సర్ ప్రక్రియ నిర్వహణలో అధికారుల ఉదాసీనతపై విపక్షాల అసహనం**

రాష్ట్రంలోని అతిపెద్ద నియోజకవర్గంగా కొనసాగుతున్న శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో ఏకంగా 40 శాతం ఓట్ల గల్లంతు విషయంలో సమావేశంలో పాల్గొన్న రాజకీయ విపక్షాలు తీవ్ర అధానాన్ని వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఈఆర్ఓ సహా ఆయా సర్కిళ్ల ఏఈఆర్వోలు సర్ ప్రక్రియ నిర్వహణ విషయంలో తీవ్ర అలసత్వం, ఉదాసీన వైఖరిని ఆలంబించడంతో ఏడు లక్షల పైచిలుకు ఉన్న ఓటరు నేడు మూడు లక్షల 77 వేలకు పడిపోవడం ఎంతవరకు సమంజసం అని, ఇందులో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా అవగతం కావడం లేదా అని ప్రశ్నించడం జరిగింది. ప్రత్యేకించి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, డిజిటలైజేషన్ విధానంలో బూతు లెవల్ అధికారులు, సూపర్వైజర్లు స్పష్టమైన నిర్లక్ష్యాన్ని కనబరచడం జరిగిందని, అనేక పోలింగ్ బూతులలో వారు అందుబాటులో లేకపోవడంతో లక్షల ఓట్లు గల్లంత కావడం దిక్కుమాలిన చర్యగా వారు అభివర్ణించినట్లు విశ్వసనీయ సమాచారం. విపక్షాల ప్రశ్నల పరంపరకు ఓ దశలో ఈఆర్ఓ నారాయణ్ అమిత్, ఏఈఆర్వోలు మౌనంగా ఉండిపోవడం వారి నిర్లక్ష్య ధోరణికి నిలువెత్తు నిదర్శనం అని పలువురు మీడియాకు వివరించడం గమనార్హం. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, సూపరింటెండెంట్లు, వివిధ రాజకీయ పార్టీల ముఖ్య నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

## 1000 రోజుల కాంగ్రెస్ పాలన.. హామీలకు మంగళం, ప్రజలకు మోసం

### 420 హామీలతో గద్దెనెక్కి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్: మంద సంజీవరెడ్డి

### సెప్టెంబర్ 2న అంబేద్కర్ విగ్రహం నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు భారీ నిరసన ర్యాలీ



**బోడుప్పల్-జనంసాక్షి :** కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనను విఫల పాలనగా అభివర్ణిస్తూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని బోడుప్పల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ మంద సంజీవరెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, హామీల అమలులో నిర్లక్ష్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సెప్టెంబర్ 1 నుంచి 8వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్‌లో మాజీ జెడ్పీటీసీ, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ ఆధ్వర్యంలో పార్టీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలన, ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు తీరుపై విస్తృతంగా చర్చించారు. అనంతరం మంద సంజీవరెడ్డి మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిందని మండిపడ్డారు. మహిళలు, రైతులు, యువకులు, ఉద్యోగులు సహా తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా నిరాశపరిచిందని ఆరోపించారు. “హామీలు ఇచ్చేటప్పుడు ఒక మాట... అధికారంలోకి వచ్చిన తర్వాత మరో మాట” అన్నట్లుగా కాంగ్రెస్ పాలన సాగుతోందని విమర్శించారు. 1000 రోజుల పాలనలో ప్రజలకు ఒరిగిందేమిటో కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 2వ తేదీ ఉదయం 9 గంటలకు బోడుప్పల్ అంబేద్కర్ విగ్రహం నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీల ఫ్లకార్డులతో భారీ నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, కార్యదర్శులు, ఉద్యమకారులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని మంద సంజీవరెడ్డి పిలుపునిచ్చారు.

## అంగన్వాడి పోస్టులకు దరఖాస్తులు స్వీకరణ

### ఆమనగల్ సిడిపిఓ శాంతిరేఖ



**తలకొండపల్లి సెప్టెంబర్ 01(జనంసాక్షి):** ఆమనగల్ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఆమనగల్,కడ్తాల్,తలకొండపల్లి,మాడ్గుల మండలాల్లో ఖాళీగా ఉన్న 31 అంగన్వాడీ పోస్టులకు అర్హులైన మహిళ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆమనగల్ సిడిపిఓ శాంతి రేఖ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలాల వారిగా కడ్తాల్ మండలంలో 15 పోస్టులు,ఆమనగల్ మండలంలో 10 పోస్టులు,తలకొండపల్లి మండలంలో 3 పోస్టులు,మాడ్గుల మండలంలో 3 పోస్టులు మంజూరైనట్లు ఆమె తెలిపారు. అర్హత కల్గిన మహిళ అభ్యర్థులు ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 10వ తేదీ వరకు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పోస్టుల వారిగా ఖాళీలు,విద్యా అర్హతలు, వయోపరిమితి,దరఖాస్తు చేయు విధానం తదితర వివరాలను సంబంధిత ఐసిడిఎస్ కార్యాలయాలు, లేదా అధికారుల ద్వారా తెలుసుకోవాలని తెలిపారు. అర్హులైన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సిడిపిఓ శాంతి రేఖ కోరారు.

# కమిషన్ల కోసమే ఎలివేటెడ్ కారిడార్ పనుల్లో జాప్యం : ఏనుగు సుదర్శన్ రెడ్డి



**ఘట్కేసర్, సెప్టెంబర్ 01 ( జనం సాక్షి ) :** మేడ్చల్ నియోజకవర్గం పిర్జాదిగూడ పరిధిలో కొనసాగుతున్న ఎలివేటెడ్ కారిడార్ బ్రిడ్జి పనులను మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి ఏనుగు సుదర్శన్ రెడ్డి ఆర్అండ్‌బీ డీఈ సరితతో పాటు సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణ పనుల పురోగతి, ట్రాఫిక్ సమస్యలు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏనుగు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. ఎలివేటెడ్ కారిడార్‌పై ప్రతిరోజూ లక్షకు పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా, లక్షలాది మంది ఉద్యోగులు, ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇంతటి కీలకమైన ప్రాజెక్టు పనులు సంవత్సరాల తరబడి నత్తనడకన సాగుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. 2018లో ఉప్పల్ నుంచి సీపీఆర్ఐ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి శంకుస్థాపన జరిగిందని, ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించిందని తెలిపారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టును తామే చేపడతామని చెప్పి ఆర్అండ్‌బీ శాఖ పర్యవేక్షణలో పనులు కొనసాగించిందని అన్నారు.

# సీపీఎస్‌ను రద్దు చేయాల్సిందే..

### జిల్లా జేఏసీ చైర్మన్ ఉటు యశ్వంత్

### కొంగరకలాన్ ఐడీవోసీ ఎదుట జేఏసీ నిరసన




**రంగారెడ్డి, సెప్టెంబర్ 1 (జనం సాక్షి) :** పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) వెంటనే పునరుద్ధరించాలని, కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేయాల్సిందేనని తెలంగాణ ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ సమితి (టీజీఈజేఏసీ) జిల్లా జేఏసీ చైర్మన్ ఉటు యశ్వంత్ అన్నారు. కొంగరకలాన్ ఐడీవోసీ ఎదుట జేఏసీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో కొంగరకలాన్‌లోని ఐడీవోసీ ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా జేఏసీ చైర్మన్ ఉటు యశ్వంత్, జిల్లా జేఏసీ కన్వీనర్ డాక్టర్ రామారావు మాట్లాడుతూ.. సీపీఎస్ విధానం ఉద్యోగుల పట్ల శాపంగా మారిందన్నారు. దీనిని ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర జేఏసీ కార్యాచరణలో భాగంగా ఈ నెల 10న తలపెట్టిన 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని జిల్లాలోని ఉద్యోగస్తులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు... సీపీఎస్ ప్రమాదకరమైన విధానమన్నారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోగా సీపీఎస్ రద్దు చేస్తామని చెప్పి, ఇప్పుడు ప్రభుత్వం దాటవేసే ధోరణి అవలంబించడం సరికాదన్నారు. వెంటనే ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా కో-కన్వీనర్ శ్రీనేష్ కుమార్ నోరి, కో-చైర్మన్లు గోపాల్, ప్రవీణ్, శాంతి శ్రీ, సుధాకర్, రాజేష్, బల్వంత్ రెడ్డి, వైస్ చైర్మన్లు నూతనకంటి వెంకట్, సైదమ్మ, రాకేష్, కార్యదర్శులు మాధవ్, ఆనంద్, మహేష్, ప్రమీల, వెంకటప్ప, పాండు రంగారెడ్డి, కల్పన, జగన్నాథ్ శర్మ, అరుణ, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# 'ఇస్తాం.. చేస్తాం'పై బీఆర్ఎస్ యుద్ధం

### కాంగ్రెస్ '420' మోసాలపై జనాగ్రహం

### నేడు ఇబ్రహీంపట్నంలో నిరసన

### జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి హాజరు

### 420 అడుగుల బాకీ కార్డు ప్రదర్శన..

### భారీగా జన సమీకరణకు సిద్ధం

**రంగారెడ్డి, సెప్టెంబర్ 1(జనంసాక్షి)**



"ఇస్తాం.. చేస్తాం" అంటూ గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం.. నేడు ప్రజల కన్నీళ్లతో చెలగాటమాడుతోంది. ఆరు గ్యారెంటీల పేరుతో మోసాల బాటపట్టిన రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఫల్యాలను నిలదీసేందుకు గులాబీ శ్రేణులు సమరభేరి మోగించాయి. ఇచ్చిన హామీలు అమలవుతున్నాయా, అన్నీ మోసాలేనా అని నిలదీసేందుకు, ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలో నేడు ఆందోళనలకు పిలుపునిచ్చారు. ఉదయం 10గంటలకు బీఆర్ఎస్ భారీ బహిరంగ ఆందోళనకు సిద్ధమైంది.

కదం తొక్కనున్న బీఆర్ఎస్..

నియోజకవర్గ కేంద్రంలోని మార్కెట్ యార్డు నుంచి ప్రారంభమయ్యే మహా ప్రదర్శన. సాగనున్నది. అంబేద్కర్ చౌరస్తా వరకు సాగే భారీ ర్యాలీగా నిర్వహించనున్నారు. ఈ ర్యాలీలో 420 అడుగుల బాకీ కార్డును ప్రదర్శించనున్నారు. కాంగ్రెస్ చేసిన మోసాలకు, ప్రజలకు చెల్లించాల్సిన బాకీలకు ప్రతీకగా ఏకంగా 420 అడుగుల పొడవైన 'కాంగ్రెస్ 420 బాకీ కార్డు' ఫ్లెక్సీని రోడ్డుపై ప్రదర్శించడం ఈ నిరసనలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. కాగా, ఈ ప్రదర్శనకు ఈ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, రాష్ట్ర యువనాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి హాజరుకానున్నారు.

వేలాదిగా తరలి రావాలి :ప్రశాంత్ కుమార్ రెడ్డి

ఓట్ల కోసం కోటి ఆశలు కల్పించి, అధికారంలోకి వచ్చాక కోకొల్లలుగా మోసాలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ తీరును ఎండగట్టేందుకు వేలాదిగా రాతలు రావాలని ఆ పార్టీ యువ నేత మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మాజీలు, పార్టీ యంత్రాంగం, మహిళా మణులు, యువజన, విద్యార్థి నాయకులు, సోషల్ మీడియా వారియర్లు మీడియా మిత్రులు తండోపతండాలుగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ దగాకోరు విధానాలపై జరిగే ఈ చారిత్రాత్మక పోరుబాటను విజయవంతం చేయాలని కోరారు. కాగా ఈ నిరసన ర్యాలీకి రాష్ట్ర నాయకత్వం కూడా హాజరయ్యే అవకాశాలున్నాయి. ముందస్తుగా ప్రచారం చేస్తే హౌజ్ అరెస్టు చేసే అవకాశం ఉందని, నేరుగా సభలో పాల్గొనే విధంగా పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చినట్లు సంచారం. అందుకే భారీ ఎత్తున జన సమీకరణకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వం అనురిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకు పోయేందుకు పార్టీ శ్రేణులను సన్నద్ధం చేస్తున్నారు.

## యాలాల మండల నూతన ఎంఈఓగా వై. శాంతప్ప



**యాలాల సెప్టెంబర్ 1 ( జనంసాక్షి ) :** నూతన మండల విద్యాధికారి (ఎంఈఓ)గా వై. శాంతప్ప నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం ఆయన యాలాల మండల విద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, మండలంలో విద్యా ప్రమాణాలను మరింత పెంచేందుకు కృషి చేస్తానన్నారు.మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచడం, మౌలిక వసతుల కల్పన, నాణ్యమైన విద్య అందించడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఉపాధ్యాయుల సమన్వయంతో పనిచేసి యాలాల మండలాన్ని విద్యారంగంలో ముందుంచుతానని అన్నారు. ముద్దయిపేట్ గ్రామానికి చెందిన వై. శాంతప్ప గతంలో ఉపాధ్యాయుడిగా, పలు మండలాల్లో విధులు నిర్వహించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.

## ఘనంగా బీఆర్ఎస్ ఉద్యమ నాయకుడు తాల్క శత్రుజ్ఞ జన్మదిన వేడుకలు



**బోడుప్పల్-జనంసాక్షి :** బీఆర్ఎస్ ఉద్యమ నాయకుడు తాల్క శత్రుజ్ఞ జన్మదిన వేడుకలను బోడుప్పల్ సర్కిల్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. బోడుప్పల్ నగర బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి,పార్టీ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని శాలువాతో శత్రుజ్ఞకు సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మంద సంజీవరెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఉద్యమంలో తాల్క శత్రుజ్ఞ చురుకైన పాత్ర పోషించారని,పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. ఆయనకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాటపల్లి రాంచంద్రారెడ్డి,బందారపు శ్రీదర్ గౌడ్,కొత్త రవి గౌడ్,కాటం రాజిరెడ్డి,మీసాల గిరి,తాల్క శత్రజ్ఞ,ఎల్లగొని శ్రీహరి,బొడగల్ల సదానంద్,ఆలీం,దేవరాజు,నర్సింగ్ నాయక్,కృష్ణ గౌడ్,ఉప్పలయ్య,యూత్ నాయకులు ఉప్పరి విజయ్,కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## వై. భాస్కర్‌చారికి ఘన వీడ్కోలు

### 11 ఏళ్ల సేవలను కొనియాడిన అధికారులు, ఉద్యోగులు



**అమీర్పేట్ /సనత్‌నగర్, సెప్టెంబర్ 1 (జనంసాక్షి) :** తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) సనత్‌నగర్ కార్యాలయంలో భద్రతా సిబ్బందిగా 11 సంవత్సరాల పాటు సేవలందించిన వై. భాస్కర్‌చారి పదవీ విరమణ సందర్భంగా మంగళవారం ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ఉద్యోగులు ఆయన సేవలను గుర్తుచేసుకుని అభినందించారు. సంస్థ భద్రతతో పాటు విధుల పట్ల భాస్కర్‌చారి చూపిన నిబద్ధత, క్రమశిక్షణను పలువురు కొనియాడారు. దీర్ఘకాలంగా సంస్థలో సేవలందించిన ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. అనంతరం భాస్కర్‌చారిని శాలువాతో సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. పదవీ విరమణ అనంతరం ఆయన జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీజీపీసీబీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అరుణ, ఔట్సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (టీజీపీసీబీ) అధ్యక్షుడు సి. మధుగౌడ్, ప్రధాన కార్యదర్శి ఆర్. నవీన్‌గౌడ్, రాజా రమేష్, బాబుగౌడ్, రఘు, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.



## సన్నరకం వడ్లు వేసిన రైతులు బోనస్ పొందడానికి డీలర్ల వద్ద వివరాలు నమోదు చేసుకోవాలి

**బొంరాస్ పేట, సెప్టెంబర్ 1( జనం సాక్షి):** సన్న రకం వడ్లు వేసిన రైతులు బోనస్ పొందడానికి డీలర్ల వద్ద వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని రేగడి మైలారం వ్యవసాయ విస్తరణాధికారి హేమ అన్నారు.మంగళవారం రేగడి మైలారం గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు.ప్రభుత్వం ఏడు రకాల సన్నవడ్లకు అనుమతించిందన్నారు. 1. బీపీటీ 5205(సాంబ మసూరి),2. డబ్ల్యూజిఎల్ 44 (సిద్ధి),3.కేఎన్ఎమ్ 1638 (కూనారం సన్నలు),4. హెచ్ఎంటి, 5. జైశ్రీరామ్, 6. కేఎన్ఎమ్7715, 7. ఆర్ఎన్ఆర్1546 (తెలంగాణ సోనా) కొన్న రైతులు డీలర్ల వద్ద నమోదు చేసుకోవాలన్నారు.సొంతంగా విత్తనాలు వాడుకున్న రైతులు స్వయంగా ప్రకటించిన లేఖ సెల్ఫ్ డిక్లరేషన్ సంబంధిత ఏఈఓలకు అందజేయాలన్నారు. వానకాలం 2026 కు సంబంధించి ఆన్లైన్ పంటల వివరాలను నమోదు చేసుకోవడం ద్వారానే ప్రభుత్వం పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తుందని, ప్రభుత్వం నియమించిన పంట నమోదు చేసే సిబ్బంది పొలాలను సందర్శించి రైతులు సాగు చేసిన పంట, సర్వే నంబరు, ఇతర వివరాలను అడిగినప్పుడు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొన్నారు.

## బంట్వారం బస్టాండ్లో మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ



**బంట్వారం సెప్టెంబర్ 01 (జనం సాక్షి) :** బంట్వారం మండల కేంద్రంలోని బస్టాండ్లో ప్రయాణికుల సౌకర్యార్థం రూ. 3.50 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. స్వచ్ఛ భారత్, గ్రామపంచాయతీ నిధులతో పనులు చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాములు, ఎంపీవో నాగరాజు, సర్పంచ్ డి.మల్లేశం, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. మరుగుదొడ్ల నిర్మాణంతో ప్రయాణికులకు సౌకర్యం కలగనుందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

## వికసిత్ భారత్‌పై గ్రామ సభ



**కేశంపేట, సెప్టెంబర్ 1 (జనం సాక్షి ) :** మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామంలో మంగళవారం వికసిత్ భారత్ కార్యక్రమంపై గ్రామ సర్పంచ్ చెదురువెల్లి భాస్కర్ గౌడ్ అధ్యక్షతన గ్రామ సభను నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎపివో అజీజ్ అహ్మద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2027--28 సంవత్సరానికి గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించడంపై ప్రధానంగా చర్చించారు.గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, అభివృద్ధి పనులు, వివిధ ప్రజా అవసరాలపై సభలో చర్చించి, ప్రాధాన్యత ఆధారంగా పనులను గుర్తించారు. గ్రామాభివృద్ధికి అవసరమైన పనులను ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ప్రణాళికాబద్ధంగా చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం సర్పంచ్ భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ. గ్రామ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని సర్పంచ్ పేర్కొన్నారు. గ్రామ సభలో ప్రజలు తమ సమస్యలు, అవసరాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, విజయ్ కుమార్, ఉపసర్పంచ్ సఫూర అమేర్, వార్డు సభ్యులు నాగరాజు, చంద్రయ్య, రమేష్ నాయక్, మంజుల జంగేశ్, రిజ్వాన బేగం మోహిజ్, వెంకటమ్మ మల్లయ్య, ఐకెపి సీసీ పరంధాములు, అంగన్వాడి టీచర్లు, ప్రేమలత, సులోచన, ఫీల్డ్ అసిస్టెంట్ జంగయ్య, వివో గోపాల్ నాయకులు ముత్యాలు, చాకలి జంగయ్య, వాజీద్, బోడ మల్లేష్, రాజేందర్, గణపతి, నుజ్జు, సాయి, రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

### బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి



**మొయినాబాద్, సెప్టెంబర్01 జనంసాక్షి:** రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు కావోస్తున్నా ఎన్నికలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి అన్నారు. మంగళవారం నాడు మొయినాబాద్ కేంద్రంలోని అంజనీ గార్డెన్ లో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంపై సమరభేరి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని ఆయన విమర్శించారు. హైడ్రా పేరుతో హైడ్రామాలు ఆడుతున్నారని, ప్రభుత్వ భూములను అడ్డగోలుగా విక్రయిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు ఈ నెల 8వ తేదీ వరకు నుంచి ఈ నెల 8వ తేదీ వరకు బీఆర్ఎస్ పార్టీ నిరసన కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమాల్లో పార్టీ నాయకులు నా కార్యకర్తలు పాల్గొని ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు చూపించాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో కొత్త నరసింహారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్ రెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ దప్పు రాజు, మాజీ సర్పంచ్లు కోట్ల నరోత్తంరెడ్డి, శ్రీహరియాదవ్, సుధాకర్ యాదవ్, రవియాదవ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కొత్త మాణిక్ రెడ్డి, షాబాద్ శ్యాంరావు కౌన్సిలర్ శ్రీధర్, నాయకులు జయవంత్, కృష్ణారెడ్డి, రవియాదవ్, అంజయ్యగౌడ్, సురేందర్ గౌడ్, ప్రసాద్ రెడ్డి, నర్సింహ్మా గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం అల్పాహార పథకం

### ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్




**రాజేంద్రనగర్,సెప్టెంబర్1(జనంసాక్షి) :** నిరుపేద విద్యార్థులు చదువుకు దూరం కాకూడదనే ఉన్నత లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం అందించే పథకాన్ని అమలు చేయడం అభినందనీయమని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని గణేష్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఉచిత అల్పాహార పథకాన్ని మంగళవారం ఉదయం ఎమ్మెల్యే లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థులకు స్వయంగా అల్పాహారం వడ్డించి, కాసేపు ముచ్చటించారు. విద్యార్థుల చదువుతో పాటు వారి ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ అవసరమని ఆయన అన్నారు. పేద విద్యార్థులు ఉదయాన్నే ఆకలితో పాఠశాలకు రాకుండా, వారికి పోషకాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. అల్పాహార పథకం వల్ల విద్యార్థులకు బంగారం భవిష్యత్తు భవిష్యత్తు అందుతుందని, అలాగే ఆరోగ్యంగా, ఉత్సాహంగా పాఠశాలకు హాజరై చదువుపై మరింత దృష్టి సారించే అవకాశం ఉంటుందని తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎంఈఓ శంకర్ రాథోడ్, ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, అధ్యక్షుడు ధనుంజయ,మాజీ కార్పొరేటర్ ప్రేమ్ దాస్ గౌడ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఎల్ఎన్ఎస్ జువెలర్స్‌కు 4 ఏళ్లు.. ప్రత్యేక ఆఫర్ల సందడి

### అల్లంపల్లి శ్రీనివాస్ ఘనంగా జన్మదిన వేడుకలు : మధు యాష్కీ

**ఎల్బీనగర్ సెప్టెంబర్ 1 (జనం సాక్షి) :** కర్మన్‌ఘాట్ శ్రీ హనుమాన్ నగర్ కాలనీలోని ఎల్ఎన్ఎస్ జువెలర్స్ 4వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 1 నుంచి 14 వరకు వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్లను ప్రకటించారు. నిర్వాహకులు అల్లం పల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎల్బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు మాజీ పార్లమెంట్ సభ్యులు టిపిసిసి అధ్యక్షులు మధు యాష్కీ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అల్లం పల్లి శ్రీనివాస్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించి, మధు యాష్కీ గౌడ్ సమక్షంలో కేక్ కట్ చేశారు. అనంతరం శ్రీనివాస్‌ను శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వార్షికోత్సవ ఆఫర్‌లో భాగంగా రూ.లక్షకు పైగా బంగారు ఆభరణాలు కొనుగోలు చేసే వారికి లక్కీ డ్రా కూపన్లు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. లక్కీ డ్రాలో ఒకరికి ద్విచక్ర వాహనం, మరొకరికి ల్యాప్‌టాప్‌తో పాటు 100 మందికి రైస్ ప్రెజర్ కుక్కర్లు బహుమతులుగా అందించనున్నట్లు వెల్లడించారు. సెప్టెంబర్ 15 సాయంత్రం 6 గంటలకు లక్కీ డ్రా నిర్వహించనున్నట్లు తెలిపారు.

## మహిళా సాధికారత లక్ష్యంగా జై చంద్ర చారిటబుల్ ట్రస్ట్ సేవలు శుభారంభం

### బిఆర్ఎస్ సీనియర్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి



**ఎల్బీనగర్ సెప్టెంబర్ 1 (జనం సాక్షి) :** ఎల్‌బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కమల వదిన ఆధ్వర్యంలో జయచంద్ర చారిటబుల్ ట్రస్ట్ తరపున మహిళల అభ్యున్నతి కోసం చైతన్యపురి డివిజన్ న్యూ దిల్సుఖ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో గత రెండు నెలలుగా ఉచిత టైలరింగ్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కొత్తగా ప్రారంభమైన మూడో, నాలుగో బ్యాచ్‌ల మహిళలను కలిసి చైతన్యపురి డివిజన్ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ మహిళా అధ్యక్షురాలు రంగేశ్వరి, సీనియర్ నాయకురాలు శోభారాణి, మహిళా నాయకురాళ్లు రమాదేవి, విజయలక్ష్మి, అర్చన, శివబిందు తదితరులు పాల్గొన్నారు.

# బస్తీ దవాఖానాలో.. మందుల కొరత

**బీపీ మిషన్ కూడా లేక అవస్థలు..**

**రోజూ 60--70 మంది రోగుల రాక**

**డీఎంహెచ్‌వో సందర్శించాలి : మాజీ చైర్మన్ చంద్రారెడ్డి**

**కీసర, సెప్టెంబర్ 01 (జనంసాక్షి) :** పేదలు, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు అందించాల్సిన నాగారం బస్తీ దవాఖానాలో కనీస వైద్య సదుపాయాలు లేకపోవడంపై బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. రోజూ 60 నుంచి 70 మంది వరకు రోగులు వస్తున్నా బీపీ పరీక్షించే మిషన్ కూడా అందుబాటులో లేకపోవడం, బీపీ, షుగర్ మాత్రలు సరిపడా లేకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ చైర్మన్ చంద్రారెడ్డి, అన్నంరాజు శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్‌గౌడ్ మంగళవారం నాగారం బస్తీ దవాఖానాను సందర్శించి, అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా రోగుల అవసరాల కోసం బీపీ పరీక్షించే మిషన్‌ను దవాఖానాకు అందజేశారు. దవాఖానాలో బీపీ, షుగర్ మాత్రలతో పాటు, ఇతర అవసరమైన మందులు, వైద్య పరికరాలు కూడా సరిపడా అందుబాటులో లేవని వారు తెలిపారు. రోజూ పెద్ద సంఖ్యలో రోగులు వస్తున్నప్పటికీ కనీస వైద్య సదుపాయాలు లేకపోవడం బాధాకరమన్నారు. బస్తీ దవాఖానాలు పేదలకు ఎంతో ఉపయోగపడాల్సి ఉండగా.. మందులు, వైద్య పరికరాల కొరతతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి అవసరమైన మందులు, వైద్య పరికరాలను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.



డీఎంహెచ్‌వో పరిశీలించాలి

మేడ్చల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డా. కె.ఆనంద్ నాగారం బస్తీ దవాఖానాను స్వయంగా సందర్శించి పరిస్థితులను పరిశీలించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. ప్రజలకు అవసరమైన వైద్య సేవలు, మందులు అందేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల ఆరోగ్య అవసరాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉన్నతాధికారుల దృష్టికి మరింత బలంగా తీసుకెళ్తామని బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు.

# వివేక్‌నగర్ బస్తీ దవాఖానా సేవలపై అధికారుల సమీక్ష

**రాష్ట్ర ప్రోగ్రామ్ అధికారి డా.ప్రసాద్, డీఎంహెచ్‌వో డా.ఆనంద్ ఆకస్మిక తనిఖీ**

**పరిశుభ్రత, భద్రత మెరుగుపర్చాలని అధికారులకు ఆదేశాలు**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 01 (జనంసాక్షి)**

వివేక్‌నగర్‌లోని బస్తీ దవాఖానాను రాష్ట్ర ప్రోగ్రామ్ అధికారి డా.ప్రసాద్, మేడ్చల్ జిల్లా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డా.కె.ఆనంద్ సందర్శించి వైద్య సేవలను పరిశీలించారు. దవాఖానా పరిసరాల పరిశుభ్రత, భద్రత, ప్రజలకు మెరుగైన సేవలందింపుపై సంబంధిత అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు.




వివేక్‌నగర్‌లోని బస్తీ దవాఖానాను రాష్ట్ర ప్రోగ్రామ్ అధికారి డా.ప్రసాద్, డీఎంహెచ్‌వో డా.కె.ఆనంద్ కలిసి సందర్శించి అక్కడ అందుతున్న ఆరోగ్య సేవలను సమీక్షించారు. ఒకే ప్రాంగణంలో వార్డు కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రం, బస్తీ దవాఖానా నిర్వహించబడుతున్న నేపథ్యంలో ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించేందుకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా దవాఖానా పరిసరాల పరిశుభ్రత, భద్రత అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రాంగణంలో అనధికారికంగా వాహనాల పార్కింగ్ చేయడం, కార్యాలయ సమయం అనంతరం కొందరు వ్యక్తులు ప్రాంగణాన్ని దుర్వినియోగం చేస్తున్నట్లు గుర్తించారు. ఖాళీ మద్యం సీసాలు, వినియోగించిన పేపర్ ప్లేట్లు, గ్లాసులు తదితర వ్యర్థాలు కనిపించడంతో వెంటనే పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్థానికులతో మాట్లాడిన అధికారులు బస్తీ దవాఖానా పనితీరు, వైద్య సేవలపై అభిప్రాయాలు సేకరించారు. దవాఖానా సేవలపై ప్రజల నుంచి ఎటువంటి ప్రధాన ఫిర్యాదులు రాకపోవడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

**ముఖ్య సూచనలు**

**ప్రాంగణంలో అనధికారిక పార్కింగ్‌ను నియంత్రించాలి**

**ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి సంబంధిత అధికారులతో సమన్వయం చేయాలి**



**సరిహద్దు గోడకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి**

**పూర్తి స్థాయిలో పారిశుధ్య చర్యలు చేపట్టాలి**

**ప్రజలకు పరిశుభ్రమైన, సురక్షిత వాతావరణంలో వైద్య సేవలు అందించాలి**

ప్రాంగణాన్ని శుభ్రంగా, భద్రంగా ఉంచేందుకు శానిటేషన్ విభాగం ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు డా.కె.ఆనంద్ తెలిపారు. ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించేందుకు అన్ని శాఖల సమన్వయంతో చర్యలు కొనసాగుతాయని పేర్కొన్నారు.



# దమ్మాయిగూడ అభివృద్ధికి మంత్రి దృష్టి సారించాలి

**శ్రీధర్‌బాబుకు మాజీ కౌన్సిలర్ రమేష్‌గౌడ్ వినతి**

**కీసర, సెప్టెంబర్ 01 (జనంసాక్షి) :** దమ్మాయిగూడ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని మాజీ కౌన్సిలర్ వసుపతి రమేష్‌గౌడ్ రాష్ట్ర మంత్రి, మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కోరారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఆధ్వర్యంలో మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా దమ్మాయిగూడ డివిజన్‌లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు, మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న దమ్మాయిగూడలో ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందని వివరించారు. దమ్మాయిగూడ అభివృద్ధే తమ లక్ష్యమని, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయమని రమేష్‌గౌడ్ పేర్కొన్నారు. డివిజన్ సమగ్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తూనే ఉంటామని చెప్పారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

# నేడు బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆమనగల్లులో కదనభేరి

**భారీగా తరలి రావాలని బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చిన మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్**



**ఆమనగల్ సెప్టెంబర్ 01(జనంసాక్షి):** కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడ్డ ప్రజా పాలన ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన వైఫల్యానికి నిరసనగా బిఆర్ఎస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు,మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్,పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపు మేరకు సెప్టెంబర్ 2 నుండి 10 వరకు కాంగ్రెస్ మోసాలపై కదనభేరి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్,మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఉప్పల వెంకటేష్ గుప్తా,ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి,కల్వకుర్తి మున్సిపల్ మాజీ చైర్మన్ ఎడమ సత్యం,ఆమనగల్ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా అన్నారు.కాంగ్రెస్ పాలన వైఫల్యానికి బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆమనగల్లులో ఈనెల 2 నుంచి కదనభేరి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మంగళవారం ఆమనగల్ పట్టణంలో బిఆర్ఎస్ పార్టీ ఆమనగల్లు, తలకొండపల్లి,మాడుగుల,కడ్తాల్ మండలాల అధ్యక్షులు గ్రామ కమిటీ అధ్యక్షులు పార్టీ నాయకులు కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వెయ్యి రోజుల కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ ప్రజాపాలనలో 420 హామీలు,ఆరు గ్యారెంటీల వైఫల్యాలు13 డిక్లరేషన్ మోసాలు వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో ప్రజల కష్టాలు తీర్చడంలో విఫలం చెందారని వారు ఆరోపించారు.దీనికి నిరసనగా ఆమనగల్లు పట్టణంలో పెద్ద ఎత్తున రైతులతో బహిరంగ ర్యాలీ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందని వారు తెలిపారు.పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన కథనభేరి సభకు భారీ ఎత్తున కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆమనగల్ మున్సిపాలిటీ కౌన్సిలర్లు పాపిశెట్టి రాము,ఎంగలి భాగ్యలక్ష్మి రఘు,అనూష శ్రీశైలం,దుడ్డు ఆంజనేయులు, ఎనుముల రమేష్,నాగిళ్ల జంగయ్య, యశోదమ్మ, కవిత, మంచుకొండ పద్మ, ఆచాలీ,కిషోర్,ఖలీల్,వస్పుల సాయిలు,ఆమనగల్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అర్జున్ రావు,లాలయ్య గౌడ్,మాజీ ఎంపీటీసీ కుమార్, శేఖర్ యాదవ్,శేఖర్,సైదులు గౌడ్, ప్రవీణ్,పరమేష్,కోట శ్రీను,పూసలి భాస్కర్, శ్రీధర్, ప్రసాద్, జహంగీర్, రంజీత్, తోట కృష్ణయ్య,జ్యోతయ్య,జహంగీర్ పాల్గొన్నారు.




## విద్యార్థుల జీవితాలతో కాంగ్రెస్ సర్కార్ చెలగాటం

**ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే చెల్లించాలి: తలసాని**

**సనత్‌నగర్, సెప్టెంబర్ 1 (జనంసాక్షి) :** రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టిగా బుద్ధి చెప్పాలని మాజీమంత్రి, బీఆర్‌ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పిలుపునిచ్చారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు మంగళవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తలసాని క్యాంపు కార్యాలయానికి ర్యాలీగా చేరుకుని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తకూడదనే ఉద్దేశంతో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని తీసుకొచ్చారని తెలిపారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనూ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను సకాలంలో చెల్లించినట్లు గుర్తుచేశారు.

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు రూ.11 వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయని ఆరోపించారు. బకాయిలు చెల్లించకపోవడంతో చదువు పూర్తిచేసిన విద్యార్థులకు విద్యాసంస్థల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కూడా తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టే పోరాటాలకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని తలసాని స్పష్టం చేశారు. ఈ నెల 7 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో బకాయిల విడుదల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని తెలిపారు. విద్యార్థులు ఐక్యంగా పోరాడితేనే సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీపై జెన్-జీ విద్యార్థులు నిర్వహించిన ఆందోళనలతో కేంద్ర ప్రభుత్వం దిగివచ్చిందని, కేంద్ర మంత్రి రాజీనామా చేయాల్సి వచ్చిందని తలసాని పేర్కొన్నారు. అదే స్ఫూర్తితో కాంగ్రెస్ ప్రభుత్వంపై విద్యార్థులు పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు బాలు, అభినయ్, గౌతమ్, రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో వారం రోజుల నిరసన కార్యక్రమాలు



**రాజేంద్రనగర్,సెప్టెంబర్1(జనంసాక్షి) :** బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, రాజేంద్రనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జ్జి పట్లొల్ల కార్తిక్ రెడ్డి పిలుపు మేరకు సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు వివిధ ప్రజా సమస్యలపై నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులతో కలిసి సీతారాం ధూళిపాళ తెలిపారు. సెప్టెంబర్ 2న శంషాబాద్‌లో నిరసన, నెరవేరని హామీల కార్డుల పంపిణీ, సాయంత్రం మణికొండ, నెక్నాంపూర్ సమస్యలపై ఛార్జ్‌షీట్ విడుదల చేయనున్నారు. 3న నీటి సరఫరా, 22ఏ అంశాలపై, 4న సంక్షేమ పథకాలపై, 5న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై నిరసనలు చేపట్టనున్నారు. 6న చిత్రపురి బస్తీ దవాఖానా సందర్శన 7న ప్రజావాణిలో ఫిర్యాదు, 8న నెక్నాంపూర్ లో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సభ సమర్పణ చేపడుతామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కుంభగల్ల ధనరాజ్, గుట్టమీది నరేందర్, అందే లక్ష్మణ్ రావు, సుమనళిని, భాను చందర్, ఆశ్వక్ అలీ, శేఖర్ తదితరులు పోలీసు కమిషనర్‌కు విడివిడిగా దరఖాస్తులు సమర్పించారు.

# గోకరకుంట చెరువుపై కబ్జా పర్వం..?

**సర్వే నంబర్లు 3, 5, 6లో అక్రమ లేఔట్లు**
**సర్వే నంబర్ 2 భూమిపై కూడా కన్నేశారంటూ ఆరోపణలు**
**కుంటలో మట్టి నింపి క్రికెట్ గ్రౌండ్, నిర్మాణాలు**
**ఫిర్యాదులు చేసినా స్పందించని అధికారులు**
**దయానంద్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి**



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 01 (జనంసాక్షి)**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర మండలం గోధుమకుంట గ్రామ పరిధిలోని గోకరకుంట చెరువు భూమి, దాని పరిసర సర్వే నంబర్లలో భారీ ఎత్తున ఆక్రమణలు, అక్రమ లేఔట్ కార్యకలాపాలు జరుగుతున్నాయని సర్వే నంబర్ 2 భూమి యజమానులు సామల దయానంద్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం జిల్లా ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు ఈ విషయాలను వెల్లడించారు. వారి కథనం ప్రకారం.. గోకరకుంటకు సంబంధించిన సర్వే నంబర్ 4, సర్వే నంబర్ 3 రికార్డులను ఆధారంగా చేసుకుని సర్వే నంబర్లు 5, 6లలో హెచ్‌ఎండీఏ అనుమతులు లేకుండానే ఓపెన్ ప్లాట్లుగా లేఔట్లు వేస్తున్నారని ఆరోపించారు. ఇదే క్రమంలో తమకు చెందిన సర్వే నంబర్--2 భూమిలోకి కూడా అక్రమంగా చొరబడి కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రశ్నించిన తమను బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**కుంటలో మట్టి నింపి గ్రౌండ్ !**

గోకరకుంట సర్వే నంబర్ 4లో మట్టి నింపి క్రికెట్ గ్రౌండ్‌గా మార్చడంతో పాటు ఇతర నిర్మాణాలు చేపట్టినట్లు ఆరోపించారు. చెరువు భూమిని గ్రౌండ్ కోసం వినియోగిస్తూ వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. మరోవైపు అదే భూమికి సంబంధించి రైతుబంధు పథకం కింద ప్రయోజనాలు పొందుతున్నారని ఆరోపించారు. కళ్ల ముందే చెరువు ఆక్రమణకు గురవుతున్నా, మట్టి నింపి నిర్మాణాలు జరుగుతున్నా నీటిపారుదల శాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఆక్రమణలను అడ్డుకోవడంలో ఇరిగేషన్ శాఖ పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కుంటలో మట్టి నింపడం వల్ల గోకరకుంట సహజ స్వరూపం, నీటి నిల్వ సామర్థ్యం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు.

**ఫిర్యాదులు చేసినా ఫలితం లేదు**







ఈ అక్రమాలపై మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పి.వినయ్‌కృష్ణారెడ్డి, జోనల్ కమిషనర్ రాధికా గుప్తా, సర్కిల్ కమిషనర్ వాణిరెడ్డి, ఆర్డీఓ నల్ల వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ యాదగిరిరెడ్డి, హైడ్రా, జిల్లా కలెక్టర్‌తో పాటు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. సర్వే నంబర్లు 2, 3, 4, 5, 6లకు సంబంధించిన రెవెన్యూ, లేఔట్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో భౌతిక హద్దులను గుర్తించాలని డిమాండ్ చేశారు. అక్రమ లేఔట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి ప్రజలు మోసపోవద్దని హెచ్చరించారు. అధికారులు వెంటనే సమగ్ర విచారణ చేపట్టి గోకరకుంట చెరువు భూమిని పరిరక్షించాలని కోరారు.

**'చెరువు మాయం చేస్తే చూస్తూ ఊరుకుంటారా?'**

గోకరకుంట చెరువు భూమిలో మట్టి నింపి గ్రౌండ్‌గా మార్చడం, నిర్మాణాలు చేపట్టడం వంటి పనులు బహిరంగంగానే జరుగుతున్నాయని బాధితులు ఆరోపించారు. చెరువు ఆక్రమణలపై ఇరిగేషన్ శాఖ, రెవెన్యూ శాఖలు వెంటనే సంయుక్త సర్వే నిర్వహించి వాస్తవాలు వెలుగులోకి తేవాలని డిమాండ్ చేశారు.

## అర్కతల గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**గ్రామ సర్పంచ్ గంజాయి రేణుక రాములు**

**నవాబుపేట్ సెప్టెంబర్ 1 ( జనం సాక్షి) :** నవాబుపేట్ మండల పరిధిలోని అర్కతల గ్రామంలో మహావీర్ హాస్పిటల్ మంగళవారంఉచిత వైద్య శిబిరాన్ని గ్రామపంచాయతీకార్యాలయంలోనిర్వహించారు. గ్రామం ప్రజలు రైతులు అధిక కష్టపడి పంటలు పండించే ముందు ఆరోగ్యమే మహాభాగ్యం అంటూ ప్రజలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే రైతులు పంటలు పండించే విధంగా ముందుకు వస్తారని వికారాబాద్ మహావీర్ ఇనిస్టిట్యూట్ ఆస్పత్రి వైద్యులు ఉచిత క్యాంపు ని ఏర్పాటు చేశారు. ప్రజలకు ఎంతటి రోగాల కైనా ఆస్పత్రి వైద్యులు ముందుండి బిపి, షుగర్, ఆర్థోపెడిక్, కంటి చూపు, అన్ని పరీక్షలు నిర్వహించి వారికి కావలసిన మందులను వైద్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గంజాయి రేణుక రాములు, ఉప సర్పంచ్ శివ నీల, పంచాయతీ వార్డు సభ్యులు ఆధ్వర్యంలో అర్కతల గ్రామంలో 92 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు 20 మంది ని రిఫర్ చేయడం జరిగింది. యొక్క 20 మందిని బుధవారం మహావీర్ ఆస్పత్రికి వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని డాక్టర్ ప్రేమ్ తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మహావీర్ ఆస్పత్రి కి వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని వారికి అన్ని విధాల సౌకర్యాలు



ఎక్రేలు స్కానింగ్లో ఎమ్మారై పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. వారికి అవసరమైన పరీక్షలు నిర్వహించి ఉచితంగా ఆపరేషన్ కూడా నిర్వహిస్తామని తెలిపారు. మహావీర్ హాస్పిటల్ లో అన్ని విధాల సౌకర్యాలు ఉన్నది కాబట్టి ప్రజలు ప్రైవేట్ హాస్పిటల్ కు వెళ్లకుండా ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.ఈ ఉచిత హెల్త్ కార్యక్రమంలో మహావీర్ ఆస్పత్రి నుండి డాక్టర్స్ కౌశిక్ చంద్రశ్రీ ఐశ్వర్య మధు, సిబ్బంది రవి ల్,అశోక్. గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు గ్రామ పెద్దలు వైద్య పరీక్షలు నిర్వహించుకున్నారు. ఈ వైద్య పరీక్షలు ప్రజలకు ఉచితంగా మందులు, మెడిసిన్ పంపిణీ చేశారు.

# మర్పల్లి, కొత్లాపూర్ క్లస్టర్లకు ఏఈఓలను నియమించండి




**మర్పల్లి సెప్టెంబర్ 01 (జనంసాక్షి) :** రైతులకు అందుబాటులో ఉండి సహాయ సూచనలు అందిస్తూ వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) లు కీలక పాత్ర పోషిస్తారు. రైతులకు సంబంధించిన పంట సాగు విధానాలు సబ్సిడీపై ఇచ్చే పరికరాలు ఎరువుల విత్తనాలు ఇలా మరెన్నో అంశాలపై రైతులు ఏఈఓ లను సంప్రదించవలసి ఉంటుంది. మర్పల్లి మండల పరిధిలోని మర్పల్లి క్లస్టర్ పరిధిలో భూచన్‌పల్లి, గుర్రంగట్టు తండా, కోటమర్పల్లి గ్రామాలు, కొత్లాపూర్ క్లస్టర్ పరిధిలో సిరిపురం, వీర్లపల్లి, పంచలింగాల, అల్లాపూర్ గ్రామాలు ఉన్నాయి. క్లస్టర్ల ఏఈవోలు లేక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా ఎరువుల బుకింగ్ ఎలా చేసుకోవాలో తెలియక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. బుకింగ్ కాకపోతే ఎవరిని సంప్రదించాలో తెలియక అయోమయానికి గురవుతున్నారు. పంటల వివరాల నమోదు, రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తదితర సమస్యల కోసం మండల కేంద్రానికి రావాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో సాగు పనులను పక్కనపెట్టి మండల కేంద్రానికి పరుగులు తీయాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ పనులకు కీలకమైన సమయంలో అధికారులు గ్రామస్థాయిలో అందుబాటులో లేకపోవడం తమ రోజువారీ పనులకు ఆటంకంగా మారుతోందని పేర్కొంటున్నారు. గతంలో పనిచేసిన ఏఈఓలు బదిలీ కావడంతో ఈ రెండు పోస్టులు ఖాళీగా ఉన్నట్లు రైతులు తెలిపారు. గ్రామస్థాయిలో రైతులకు అత్యంత అవసరమైన వ్యవసాయ సేవలు అందించేందుకు ఖాళీగా ఉన్న ఏఈఓ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని కోరుతున్నారు. జిల్లాస్థాయి వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపి మర్పల్లి, కొత్లాపూర్ క్లస్టర్లకు ఏఈఓ లను వెంటనే నియమించాలని రైతులు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేసుకుంటున్నారు.

# కమిటీ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించాలి

- సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ఆర్బీఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి



**తాండూరు సెప్టెంబర్ 1(జనంసాక్షి) :** హిందూ ఉత్సవ కమిటీ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించాలని సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ఆర్బీఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన హిందూ ఉత్సవ కమిటీ నూతన కార్యవర్గానికి కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ఆర్బీఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. హిందూ ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శిగా బీర్కెట్ రఘు, కోశాధికారిగా కౌన్సిలర్ కిరణ్ కుమార్ ఎన్నికైన సందర్భంగా వారిని బుయ్యని శ్రీనివాస్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు కమిటీ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తూ హిందూ పండుగలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో, క్రమశిక్షణతో నిర్వహించాలని ఆకాంక్షించారు. తాండూరు ప్రాంతంలో పండుగల సందర్భంగా ప్రజలందరినీ సమన్వయం చేసుకుంటూ శాంతియుత వాతావరణంలో ఉత్సవాలను నిర్వహించేందుకు కృషి చేయాలని సూచించారు. హిందూ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలు భక్తిభావంతో పాటు సమాజంలో ఐక్యత, సోదరభావం, సేవా స్ఫూర్తిని పెంపొందించేలా ఉండాలని పేర్కొన్నారు. నూతన కార్యవర్గం ప్రజల సహకారంతో మరింత సమర్ధవంతంగా పనిచేసి కమిటీకి మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బీర్కెట్ రఘు, కిరణ్ కుమార్‌లు బిఎస్ఆర్ కు కృతజ్ఞతలు తెలిపారు. తమపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తూ కమిటీ అభివృద్ధికి, ఉత్సవాల విజయవంతానికి కృషి చేస్తామని తెలిపారు.

# కాంగ్రెస్ 420 మోసాలపై సమరశంఖం

- నేడు ఇబ్రహీంపట్నంలో బీఆర్ఎస్ ధర్నా
- హాజరు కానున్న మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, బంటి



**యాచారం, సెప్టెంబర్ 1(జనం సాక్షి )** కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, రైతులకు చేసిన మోసాలకు నిరసనగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నేడు ఉదయం 10గంటలకు ఇబ్రహీంపట్నంలో భారీ ఎత్తున రైతుల ర్యాలీ, ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్టీ మండల కమిటీ ప్రకటించింది. ఈ పోరుబాట కార్యక్రమంలో బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటి) ముఖ్య అతిథులుగా పాల్గొంటారని మండల పార్టీ అధ్యక్షులు కర్నాటి రమేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి పాచ్చ భాష తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రైతులకు తీవ్ర అన్యాయం చేస్తోందని వారు విమర్శించారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాలు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలకు గురైన రైతులు, ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

## ఉద్యమకారుల సమస్యలపై సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి

**తాండూరు సెప్టెంబర్ 1(జనంసాక్షి) :** తెలంగాణ ఉద్యమకారుల సమస్యలపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తాండూర్ ఉద్యమకారుల ఆధ్వర్యంలో ఘనంగా పాలాభిషేకం చేశారు. తెలంగాణ ఉద్యమంలో తమ భవిష్యత్తును, జీవితాలను లెక్కచేయకుండా తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా పనిచేసిన ఉద్యమకారులను గుర్తించేందుకు కేశవరావు అధ్యక్షతన కేకే కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఆ కమిటీ ప్రతి జిల్లాలో పర్యటించి ఉద్యమ సమయంలో ప్రాణాలు కోల్పోయిన వారు, జైళ్లకు వెళ్లిన వారు, ధర్నాలు, సకల జనుల సమ్మెలో పాల్గొన్న ఉద్యమకారులను గుర్తించి నివేదికను సీఎం రేవంత్ రెడ్డికి సమర్పించింది. ఈ నివేదికపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, పెన్షన్, గుర్తింపు మరియు గౌరవం కల్పించేందుకు సానుకూలంగా స్పందించారు. దీనికి కృతజ్ఞతగా తాండూర్ ఉద్యమకారులు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు మాట్లాడుతూ.. కచ్చితంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించి, మేనిఫెస్టోలో పెట్టిన విధంగా హామీలను అమలు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల రాష్ట్ర ఉపాధ్యక్షులు ఒంగోని బాయ్ శ్రీనివాస్, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు సంజయ్ గౌడ్, ఉద్యమకారుల సంఘం కోఆర్డినేటర్ న్యాయవాది జిలాని, ఉద్యమకారుల జిల్లా ఉపాధ్యక్షులు జి. ప్రకాష్ గౌడ్, ఉద్యమకారులు అశోక్, మోయిస్ బేగ్, వెంకటయ్య, ధనరాజ్, శ్రీను, నవీన్ పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- సిలబస్ ను సకాలంలో పూర్తి చేయాలి
- పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేసిన డీఈవో వెంకటేశ్వర్లు



**మహేశ్వరం, సెప్టెంబర్ 1(జనంసాక్షి):** విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఈవో వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మహేశ్వరం మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, మహేశ్వరం బాలికల జడ్పీహెచ్ఎస్, మండల వనరుల కేంద్రంను, మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... నిర్ణీత గడువులోపు సిలబస్ ను పూర్తి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. సిలబస్ ను సకాలంలో పూర్తి చేయని ఉపాధ్యాయులపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కస్తూర్బా గాంధీ విద్యాలయంలో కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, వంట సామాగ్రి భద్రపరిచే గది, వసతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం ఎంఈఓ కస్నానాయక్, ప్రధానోపాధ్యాయులు శంకరయ్య, భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ దేవతల మందిర నిర్మాణానికి 50 వేల విరాళం.

మర్పల్లి సెప్టెంబర్ 01 (జనంసాక్షి) వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల కేంద్రంలో గ్రామదేవతల మందిరాల నిర్మాణ పనులు చక్క చక్క జరుగుతున్నాయి. నిర్మాణ పనులు త్వరగా పూర్తి అయి గ్రామదేవతుల దీవెనలు గ్రామస్తులపై ఉండాలి. ఆలయ నిర్మాణానికి మర్పల్లి గ్రామం వీరశైవ లింగాయత్ సమాజం నుండి 50వేల రూపాయల విరాళం ఆలయ కమిటీ సభ్యులు సర్వేష్ కు మంగళవారం నగదును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్మాణంలో ప్రతి ఒక్కరు భాగ్యస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మర్పల్లి గ్రామ ఉపసర్పంచ్ కొప్పుల ప్రభు, వీరశైవ లింగాయత్ గ్రామ కమిటీ అధ్యక్షుడు విజయ్, సిద్ధిరామప్ప, మండల కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు కోటి గారి లడ్డు పటేల్, వినోద్ స్వామి, వీర్ శెట్టి, తిరుపతి, నర్సింలు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# శుభ సాయి కన్స్ట్రక్షన్స్ హాట్ మిక్స్ ప్లాంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి



**యాలాల్, సెప్టెంబర్ 1 (జనంసాక్షి) :** యాలాల్ మండలం తిమ్మాయిపల్లి గ్రామ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన శుభ సాయి కన్స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలోని హాట్ మిక్స్ ప్లాంట్ ను తాండూరు శాసనసభ్యులు బుయ్యని మనోహర్ రెడ్డి మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాండూరు నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. నాణ్యమైన రోడ్ల నిర్మాణానికి ఇలాంటి హాట్ మిక్స్ ప్లాంట్లు ఎంతో అవసరమని, ఈ ప్రాంతంలో ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, నియోజకవర్గ అభివృద్ధిలో శుభ సాయి కన్స్ట్రక్షన్స్ సంస్థ భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శుభ సాయి కన్స్ట్రక్షన్స్ యాజమాన్యం, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# దేవులతండా నుండి దేవనూర్ వరకు గుంతలమయంగా మారిన రోడ్డు

- సొంత ఖర్చులతో మరమ్మత్తు చేసిన ఉప సర్పంచ్, బిఆర్ఎస్ యువ నాయకులు



**యాలాల సెప్టెంబర్ 1(జనంసాక్షి) :** యాలాల మండలంలోని దేవులతండా నుండి దేవనూర్ వరకు వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా గుంతలమయంగా మారి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్. అండ్ బి శాఖ వారు నాగిరెడ్డిపల్లి నుండి వడిచర్ల వరకు రోడ్డు వేసి, వడిచర్ల నుండి దేవనూర్ వరకు రోడ్డు వేయకుండా వదిలేయడంతో ఈ సమస్య ఏర్పడింది. గుంతల కారణంగా ఈ మార్గంలో వెళ్లే ప్రజలు, వాహనదారులు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో మంగళవారం దేవులతండా ఉప సర్పంచ్, బిఆర్ఎస్ యువ నాయకులు కిరణ్ మరియు మల్లేశం స్పందించారు. వాహనదారులు పడుతున్న ఇబ్బందిని చూసి తట్టుకోలేక సొంత ఖర్చులతో గుంతల్లో మొరం పోయించి తాత్కాలిక మరమ్మత్తులు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ రోడ్డు ఇలాగే ఉంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ఆర్ అండ్ బి అధికారులు వెంటనే స్పందించి పెండింగ్ లో ఉన్న వడిచర్ల నుండి దేవనూర్ వరకు రోడ్డు పనులను పూర్తి చేయాలని కోరారు. తాండూర్ ఎమ్మెల్యే చొరవ తీసుకుని ఈ రోడ్డును త్వరగా వేయించాలని గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు.

# ఆర్టీసీని దేశంలోనే నంబర్-1గా నిలుపుతాం

- **1000 రోజుల్లో 2,932 కొత్త బస్సులు.. 1,024 ఎలక్ట్రిక్ బస్సులు**
- **హైదరాబాద్‌లో త్వరలో మరో 2,200 ఈ-బస్సులు**



**ముషీరాబాద్, సెప్టెంబర్ 1 (జనంసాక్షి):** ప్రజా పాలన 1000 రోజుల సందర్భంగా రవాణా రంగంలో పలు సంస్కరణలు చేపట్టామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంగళవారం బస్‌భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో శాఖ, టీజీఎస్ఆర్టీసీ ప్రగతిని వివరించారు. మహిళా సాధికారత, ఉద్యోగుల సంక్షేమం, ఆధునిక ప్రజా రవాణాకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు.
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించిందని తెలిపారు. ఇప్పటివరకు 347.36 కోట్ల మంది మహిళలు ప్రయాణించారని, ఆర్టీసీ ఆక్యుపెన్సీ 67 శాతం నుంచి 89 శాతానికి పెరిగిందన్నారు. మహిళా సంఘాల ద్వారా 600 బస్సులు కొనుగోలు చేయించి వాటి నిర్వహణ బాధ్యతలు అప్పగించామని చెప్పారు.
ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2,932 కొత్త బస్సులు కొనుగోలు చేశామని, రాష్ట్రంలో 1,024 ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయని తెలిపారు. హైదరాబాద్‌లో త్వరలో మరో 2,200 ఈ-బస్సులు అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. ఆర్టీసీలో 4,538 ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపట్టామని, ఉద్యోగుల సంక్షేమానికి పలు నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు.
హైదరాబాద్‌లో 370 కొత్త రూట్లలో బస్సు సర్వీసులు ప్రారంభించామని, ఎంఎంటీఎస్, మెట్రోతో సమన్వయంతో లాస్ట్‌మైల్ కనెక్టివిటీని మెరుగుపరుస్తామని తెలిపారు. రోడ్డు భద్రతకు 4ఈ వ్యూహంతో చర్యలు చేపడుతున్నామని, ఏఎన్‌పీఆర్ కెమెరాలతోపాటు ఏఐ సాంకేతికతను వినియోగిస్తామని పేర్కొన్నారు. ఆర్టీసీ పేద, మధ్యతరగతి ప్రజలకు లైఫ్‌లైన్ అని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సహకారంతో సంస్థను భవిష్యత్తులో దేశంలోనే నంబర్-1 ప్రజా రవాణా సంస్థగా తీర్చిదిద్దుతామని మంత్రి స్పష్టం చేశారు.



## నిందితుడిని ఎన్‌కౌంటర్ చేయాలి

**శిరీష కుటుంబానికి న్యాయం చేయాలి : ఏబీవీపీ రాష్ట్ర వనవాసి కన్వీనర్ రాజేష్**

మహేశ్వరం,సెప్టెంబర్1(జనంసాక్షి):గిరిజన బిడ్డ శిరీషను అత్యంత కిరాతకంగా హత్య,అత్యాచారం చేసిన సనావుల్లఖాన్ ను ఎన్ కౌంటర్ చేయాలని ఏబీవీపీ రాష్ట్ర వనవాసి కన్వీనర్ రాజేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఏబీవీపీ మహేశ్వరం శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మహేశ్వరం మండల కేంద్రంలో గిరిజన బిడ్డ శిరీష కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ, నిందితుడి దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ... శిరీష హత్య కేసులో నిందితుడు పై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజనులపై జరుగుతున్న దారుణాలను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలన్నారు.బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి ప్రణీత్, సయిద్,అబ్లీష,రోహిత్, సాయి కార్తీక్,చింటూ,శృతి, ఏబీవీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో చెట్టును ఢీకొట్టిన డీసీఎం డ్రైవర్‌పై కేసు నమోదు

**చేవెళ్ల, సెప్టెంబరు 01 (జనంసాక్షి):** మద్యం సేవించి డీసీఎం వాహనం నడుపుతూ చెట్టును ఢీకొట్టిన ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని పామెన గేట్ సమీపంలో డీసీఎం వాహనం చెట్టును ఢీకొట్టినట్లు సమాచారం అందడంతో పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడ ఏపీ 28 టీబీ 8444 నంబర్ గల డీసీఎం చెట్టును ఢీకొని ఉండగా, డ్రైవర్ వాహనం పక్కనే ఉన్నాడు. పోలీసులు డ్రైవర్‌ను విచారించగా అతని పేరు రాజేష్‌గా, చేవెళ్లలోని వాసవి రెడీమిక్స్ సమీపంలో నివాసముంటున్నట్లు వెల్లడైంది. డ్రైవర్ మద్యం సేవించి వాహనం నడిపినట్లు అనుమానం రావడంతో వాహనాన్ని రోడ్డు పక్కకు తరలించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. అనంతరం రాజేష్‌ను చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌కు తరలించి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష నిర్వహించగా మద్యం సేవించినట్లు నిర్ధారణ అయింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ సమరభేరి

**ఏడు రోజుల పాటు నిరసనలు.. నేడు చేవెళ్లలో ధర్నా**

చేవెళ్ల, సెప్టెంబరు 1 (జనంసాక్షి) ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఏడు రోజుల పాటు నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలోని వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వివిధ ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ చేవెళ్ల మండల అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరసన కార్యక్రమాల్లో భాగంగా సెప్టెంబరు 2న ఉదయం 10 గంటలకు చేవెళ్ల వెంకటేశ్వరస్వామి ఆలయ కమాన్ ఎదురుగా, పోలీస్‌స్టేషన్ ముందు ధర్నా నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని ఆరోపిస్తూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టనున్నట్లు తెలిపారు.

అలాగే ప్రజలకు 'బాకీ కార్డులు' పంపిణీ చేసి, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు, వాటి అమలు తీరును ప్రజలకు వివరించనున్నట్లు ప్రభాకర్ తెలిపారు. ఏడు రోజుల పాటు నిర్వహించే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు, ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

## జీహెచ్ఎంసీ ఎస్ఈని కలిసిన మన్నె గోవర్ధన్ రెడ్డి

**పాదయాత్రల్లో గుర్తించిన ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఎంఆర్‌జీ**



**ఖైరతాబాద్, సెప్టెంబర్ 01 (జనం సాక్షి) :** ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీఆర్ఎస్ ఖైరతాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్ రెడ్డి(ఎంఆర్‌జీ) జీహెచ్ ఎంసీ ఎస్ఈ(సూపరింటెండింగ్ ఇంజనీర్) విజయ్ కుమార్‌ను మంగళవారం జిహెచ్ఎంసి కార్యాల యంలో కలిసి నియోజకవర్గ సమస్యలపై వినతి పత్రం అందజేశారు.ఇటీవల నియోజకవర్గ పరిధి లో నిర్వహిస్తున్న 'సమస్యలపై సమరం' పాదయా త్రల్లో ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్య లను అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. వెంకటేశ్వర కాలనీ, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఖైరతాబాద్, ఫిలింనగర్ తదితర డివిజన్లలో రోడ్లు, స్ట్రీట్‌లైట్ల సమస్యలు తీవ్రంగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి పనులను త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేయాలని కోరారు.ప్రత్యేకంగా వెంకటేశ్వర కాలనీ డివిజన్‌లోని నవోదయ కాల నీలో కొత్త సీసీ రోడ్డు నిర్మించాలని, అలాగే ఖైరతా బాద్ డివిజన్‌లోని మహాభారత్ నగర్, గాంధీనగర్, ఇంద్రానగర్ ప్రాంతాల్లో కొత్త సీసీ రోడ్లు వేయాలని విజ్ఞప్తి చేశారు.గతంలో జోనల్ కమిషనర్‌కు సమ ర్పించిన వినతిపత్రాల్లో పేర్కొన్న సమస్యలు, పెం డింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను కూడా ఎస్ఈ విజయ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు.ఆయా పను లను త్వరగా చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుం డా చూడాలని కోరారు.ప్రజల సమస్యలను క్షేత్రస్థా యిలో తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం నిరం తరం పోరాడుతామని మన్నె గోవర్ధన్ రెడ్డి తెలి పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గజ్జల ఆనంద్, శ్యామ్ గౌడ్, బాలు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫిట్స్‌తో అస్వస్థత.. చికిత్స పొందుతూ కన్నుమూత

**ఎస్ఆర్‌నగర్, (జనంసాక్షి):** బాల్కంపేట దేవాలయం సమీపంలో ఫిట్స్‌తో అస్వస్థతకు గురైన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆగస్టు 31న దేవాలయం సమీపంలో ఫిట్స్‌తో బాధపడుతున్న వ్యక్తిని స్థానికులు గుర్తించి ఎస్ఆర్‌నగర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని అతడిని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలియకపోవడంతో తొలుత గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అనంతరం మృతుడిని అశోక్‌గా గుర్తించారు. క్రైమ్ నం.519/2026, సెక్షన్ 194 బీఎన్ఎస్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అశోక్ కుటుంబ సభ్యులు, బంధువుల ఆచూకీ కోసం పోలీసులు ప్రయత్నిస్తున్నారు. సమాచారం తెలిసిన వారు ఎస్ఆర్‌నగర్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

### కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ సమరభేరి

**ఏడు రోజుల పాటు నిరసనలు.. నేడు చేవెళ్లలో ధర్నా**

**చేవెళ్ల, సెప్టెంబరు 1 (జనంసాక్షి) :** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఏడు రోజుల పాటు నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలోని వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వివిధ ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ చేవెళ్ల మండల అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరసన కార్యక్రమాల్లో భాగంగా సెప్టెంబరు 2న ఉదయం 10 గంటలకు చేవెళ్ల వెంకటేశ్వరస్వామి ఆలయ కమాన్ ఎదురుగా, పోలీస్‌స్టేషన్ ముందు ధర్నా నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని ఆరోపిస్తూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్ట నున్నట్లు తెలిపారు. అలాగే ప్రజలకు 'బాకీ కార్డులు' పంపిణీ చేసి, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు, వాటి అమలు తీరును ప్రజలకు వివరించనున్నట్లు ప్రభాకర్ తెలిపారు. ఏడు రోజుల పాటు నిర్వహించే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, సంఘాల నాయకులు, ఉద్యమకారులు పాల్గొనాలని ఆయన కోరారు.

# శోభాయమానంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు

- **మండపాలకు ఉచిత విద్యుత్.. 700 ప్రత్యేక బస్సులు**
- **భద్రత, పారిశుద్ధ్యం, వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి**
- **రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**



**ఖైరతాబాద్, సెప్టెంబర్ 1 (జనంసాక్షి):**
గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా, శోభాయమానంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌లో మంగళవారం 'గణేష్ ఉత్సవ వేడుకలు-2026'పై ఉన్నతస్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాల్లో ఉత్సవాలు, నిమజ్జన ఏర్పాట్లపై సమీక్షించారు. రాష్ట్రంలోని అన్ని గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని మంత్రి తెలిపారు. నిర్వాహకులు నిర్దేశిత విధానంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో పటిష్ట బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. షీ టీమ్స్, యాంటీ థెఫ్ట్ బృందాలను వినియోగించి శాంతిభద్రతలు, మతసామరస్యాన్ని కాపాడాలని సూచించారు. పారిశుద్ధ్య సిబ్బందిని 24 గంటలూ అందుబాటులో ఉంచడంతో పాటు రోడ్ల మరమ్మతులు, వీధి దీపాలు, బయో టాయిలెట్లు, ఫాగింగ్ వంటి ఏర్పాట్లు చేయాలన్నారు. కీలక ప్రాంతాల్లో 24 గంటల వైద్య శిబిరాలు, అంబులెన్సులు, అత్యవసర వైద్య బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా టీజీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో సుమారు 700 ప్రత్యేక బస్సులు నడపాలని, మెట్రో రైళ్ల ఫ్రీక్వెన్సీని పెంచి అవసరమైతే సేవలను పొడిగించాలని సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో గజ ఈతగాళ్లు, అత్యవసర బృందాలు, లైఫ్‌బోట్లు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.
పర్యావరణహిత ఉత్సవాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, మట్టి విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహించాలని మంత్రి కోరారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలని, డీజేలపై అమల్లో ఉన్న నిబంధనలను కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉత్సవాలు పూర్తయ్యే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని, మూడు జిల్లాల కలెక్టర్లు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పర్యవేక్షించాలని మంత్రి స్పష్టం చేశారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, నవీన్ యాదవ్, రఘువీర్‌రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, డీజీపీ సీవీ ఆనంద్, పోలీసు ఉన్నతాధికారులు, మూడు జిల్లాల కలెక్టర్లు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.



## ప్రమాదాలు జరగకుండా భారికేడ్స్ ఏర్పాటు చేయాలి

**షేక్‌పేట (జనంసాక్షి) :** నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారిన మలకం చెరువు బ్యాక్ గేట్ రోడ్డు, ప్రతి రోజూ వందల సంఖ్యలో మలకం చెరువుకు వాకర్స్ వాస్తు ఉంటారు, అక్కడే టిఫిన్ సెంటర్లు, జ్యూస్ బండ్లు, బైకు , కార్లు పార్కింగ్ చేస్తుండటంతో రోడ్డు ఇరుకుగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయి అని వాకర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, అదే చోట మూడు రోడ్లు కలవడం వల్ల ఎటు నుండి ఎవరు వస్తున్నారో చూసుకోవడం కష్టంగా ఉందని ఎప్పుడు ఏ వాహనం వచ్చి తగులు తుందో అన్న భయంతో నడుస్తున్నామని చెప్తున్నారు. చిత్రపురి కాలనీ, పంచవటి కాలనీ, రాయదుర్గం నుండి వచ్చే మూడు దారులు ఒకే చోట కలవడం తో పాటుగా, అపర్ణ టవర్స్ కన్స్ట్రక్షన్ జరుగు తుండటంతో బారి వాహనాలు సిమెంట్, స్టీలు, ఇసక లోడ్ వాహనాలు రావడంతో ట్రాఫిక్ బారీగా ఏర్పడటమే కాకుండా, నిత్యం ప్రమాదాలకు నెలవుగా మారిందని తక్షణమే సంబంధిత అధికారులు బారికేడ్స్ ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని మలకం చెరువు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పెద్దగోని సతీష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి నరుకుడు బిందెల మల్లికార్జున్ తో పాటుగా కమిటీ సభ్యులు, వాకర్స్ విజ్ఞప్తి చేశారు.

## ఇండస్ వ్యాలీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చంద్రశేఖర్ ఉప్పులేటి



**రాజేంద్రనగర్,సెప్టెంబర్1(జనంసాక్షి) :** ఇండస్ వ్యాలీ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షుడిగా చంద్రశేఖర్ ఉప్పులేటి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఎం.డి. వాజిద్, బలరామ కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా విజయ్ ఆనంద్, కోశాధికారిగా ప్రభాకర్, సంయుక్త కార్యదర్శిగా వై. నాగేందర్, సాంస్కృతిక కార్యదర్శిగా మణిదర్ స్వర్ణ, కార్యవర్గ సభ్యులుగా ఎం. ఆదిత్య, రవి కంబాల ఎన్నికయ్యారు. కాలనీ వాసుల సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాలు, సామాజిక సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ అందరినీ కలుపుకొని ఐక్యతతో ముందుకు సాగుతామని నూతన అధ్యక్షుడు చంద్రశేఖర్ ఉప్పులేటి తెలిపారు.

## కాంగ్రెస్ చర్యలకు నిరసనగా బీజేపీ ఆందోళన



**మొయినాబాద్ సెప్టెంబర్ 1(జనం సాక్షి):** బీజేపీ కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు దాడి చేశారంటూ ఆరోపిస్తూ మొయినాబాద్ మండల బీజేపీ నాయకులు మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ విధ్వంసక చర్యలను ఖండిస్తూ పార్టీ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కె.ఎస్. రత్నం, రాష్ట్ర సీనియర్ నాయకులు కంజర్ల ప్రకాష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి బీజేపీ నిరంతరం పోరాడుతుందని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్, మండల అధ్యక్షుడు దారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్ జగపతి, మండల సీనియర్ నాయకులు మోర నర్సింహారెడ్డి, అత్తాపురం శ్రీనివాస్‌గౌడ్, తాళ్ల శ్రీనివాస్‌గౌడ్, అమరేందర్‌రెడ్డి, పద్మనాభం, అశోక్‌యాదవ్, సుధీర్‌యాదవ్, రాంరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి రాయనోళ్ల రవీందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డుకు బారికేడ్.. కాలనీలకు ట్రాఫిక్ తిప్పలు

### చేతననగర్ ఎగ్జిట్‌లో అడ్డుకట్టు.. 25 అడుగుల రోడ్డుపై స్కూల్ బస్సుల రద్దీ

### పాఠశాల వేళల్లో కిక్కిరిసిన రహదారులు.. పిల్లలు, వృద్ధులకు ఇక్కట్లు

**అత్యవసర వేళ అంబులెన్స్‌ల రాకపైనా కావేరి ఎన్‌క్లేవ్ వాసుల ఆందోళన**

**ఒకరిని చూసి మరొకరు.. వజ్ర ఎన్‌క్లేవ్‌లోనూ బారికేడ్**

**వినాయక విగ్రహాల తరలింపుపైనా ఇబ్బందేనంటున్న స్థానికులు**

**అల్వాల్ హిల్స్ రోడ్లపైనా పెరిగిన ట్రాఫిక్**



**అల్వాల్, సెప్టెంబరు 1 (జనంసాక్షి):** ఒక కాలనీ సమస్యను పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన బారికేడ్.. ఇరుగుపొరుగు కాలనీలకు ట్రాఫిక్ తిప్పలు తెచ్చిపెడుతోంది. చేతననగర్ హౌసింగ్ కాలనీ ఎగ్జిట్ వద్ద ఏర్పాటు చేసిన ఇనుప బారికేడ్‌తో ప్రధాన మార్గంలో రాకపోకలు పరిమితం కావడంతో వాహనాలు ప్రత్యామ్నాయ రహదారులపైకి మళ్లుతున్నాయి. దీంతో వజ్ర ఎన్‌క్లేవ్ రోడ్డు నంబరు 4పై స్కూల్ బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాల రద్దీ పెరిగిందని స్థానికులు చెబుతున్నారు. సుమారు 25 అడుగుల వెడల్పు ఉన్న ఈ రహదారిలో ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు దారి ఇచ్చేందుకు కూడా స్థలం లేక, పాఠశాలల ప్రారంభ, ముగింపు వేళల్లో రాకపోకలు స్తంభిస్తున్నాయని వాపోతున్నారు.



చేతననగర్ ఎగ్జిట్ మార్గం వజ్ర ఎన్‌క్లేవ్, కావేరి ఎన్‌క్లేవ్, టీఎస్‌ఆర్‌ఆర్ కాలనీలకు ప్రధాన రహదారితో అనుసంధానమయ్యే కీలక మార్గమని స్థానికులు తెలిపారు. భారీ వాహనాలు, స్కూల్ బస్సులు చేతననగర్ వైపు వెళ్లకుండా బారికేడ్ ఏర్పాటు చేయడంతో ఆయా వాహనాలు ప్రత్యామ్నాయంగా ఇరుకు అంతర్గత రహదారులను ఆశ్రయించాల్సి వస్తోందని చెప్పారు. ఒక ప్రాంతంలోని సమస్యను నియంత్రించే ప్రయత్నం.. మరో ప్రాంతంలో రద్దీకి కారణమవుతోందని పేర్కొన్నారు.

**ఇరుకు రోడ్డుపై బస్సుల భారం :** వజ్ర ఎన్‌క్లేవ్ రోడ్డు నంబరు 4పై స్కూల్ బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాల రాకపోకలు పెరిగాయని స్థానికులు తెలిపారు. సుమారు 25 అడుగుల వెడల్పు ఉన్న ఈ రహదారిలో బస్సు ఎదురుగా మరో వాహనం వస్తే పక్కకు తప్పుకునేందుకు స్థలం ఉండటం లేదని చెప్పారు. పాఠశాలల ప్రారంభ, ముగింపు సమయాల్లో వాహనాలు కిక్కిరిసి రాకపోకలు నిలిచిపోతున్నాయని తెలిపారు. వాహనాల మధ్యగా పిల్లలు, వృద్ధులు రాకపోకలు సాగించాల్సి వస్తుండటంతో భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**అత్యవసర వేళ అంబులెన్స్‌లకు ఇబ్బందే! :** చేతననగర్ ఎగ్జిట్‌లోని బారికేడ్ కారణంగా అత్యవసర సమయాల్లో కావేరి ఎన్‌క్లేవ్, టీఎస్‌ఆర్‌ఆర్ కాలనీల్లోకి అంబులెన్సులు, అగ్నిమాపక వాహనాలు చేరేందుకు ఇబ్బంది ఏర్పడుతుందని స్థానికులు చెబుతున్నారు. బారికేడ్ వద్ద అత్యవసర వాహనాలు నిరాటంకంగా వెళ్లేందుకు తగినంత స్థలం లేదని పేర్కొంటున్నారు. అనారోగ్యంతో ఉన్నవారిని ఆసుపత్రికి తరలించే సమయంలో అంబులెన్స్ ప్రత్యామ్నాయ మార్గంలో చుట్టూ తిరగాల్సి వస్తే విలువైన సమయం వృథా అయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఒకరిని చూసి మరొకరు.. వజ్ర ఎన్‌క్లేవ్‌లోనూ బారికేడ్**

చేతననగర్‌లో బారికేడ్ ఏర్పాటు చేసిన నేపథ్యంలో వజ్ర ఎన్‌క్లేవ్‌లోనూ ఎత్తైన ఇనుప బారికేడ్ ఏర్పాటు చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం దీని ఎత్తు కారణంగా సాధారణ వాహనాల రాకపోకలకు పెద్దగా ఇబ్బంది లేకపోయినా.. వినాయక చవితి సమీపిస్తున్న నేపథ్యంలో పెద్ద విగ్రహాలను కాలనీలోకి తీసుకురావడం, నిమజ్జనానికి తరలించడం ఎలా అన్న ఆందోళన వ్యక్తమవుతోంది. విగ్రహాలను తరలించే వాహనాలు సులభంగా వెళ్లేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని వారు కోరుతున్నారు.

**అల్వాల్ హిల్స్ రోడ్లపైనా ట్రాఫిక్ :** చేతననగర్ వైపు భారీ వాహనాల రాకపోకలు పరిమితం కావడంతో స్కూల్ బస్సులు, ఇతర వాహనాలు అల్వాల్ హిల్స్ కాలనీ రోడ్డు నంబరు 13 మీదుగా మళ్లుతున్నాయని కాలనీ అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి తెలిపారు. దీంతో 13వ రహదారితో పాటు 14, 15, 16వ నంబరు రహదారుల వైపునా ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందన్నారు. భారీ వాహనాల రాకపోకలతో డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు దెబ్బతింటున్నాయని, పాఠశాలల ప్రారంభ, ముగింపు వేళల్లో రద్దీ మరింత తీవ్రంగా ఉంటోందని పేర్కొన్నారు.



**బారికేడ్‌కు అనుమతి ఉందా? :** చేతననగర్ ఎగ్జిట్‌లో ఏర్పాటు చేసిన ఇనుప బారికేడ్, స్పీడ్ బ్రేకర్‌కు అధికారిక అనుమతి ఉందా? ప్రజా రహదారిపై రాకపోకలను ప్రభావితం చేసేలా వీటిని ఏర్పాటు చేయడానికి నిబంధనలు అనుమతిస్తున్నాయా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. స్కూల్ బస్సుల రాకపోకలతో స్థానికులకు ఇబ్బందులు ఉంటే ట్రాఫిక్ నియంత్రణ, బస్సుల సమయాల క్రమబద్ధీకరణ, పికప్ డ్రాప్ ప్రాంతాల నిర్ణయం వంటి ప్రత్యామ్నాయ చర్యలను అధికారులు పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. బారికేడ్ల ఏర్పాటు, రహదారిపై ఏర్పడుతున్న ఇబ్బందులపై మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ బోగేశ్వర్లును వివరణ కోరగా.. ఈ విషయం తమ దృష్టికి ఇంతవరకు రాలేదని, ప్రజల రాకపోకలకు, ముఖ్యంగా అత్యవసర వాహనాల ప్రవేశానికి ఇబ్బంది కలిగేలా బారికేడ్లు ఏర్పాటు చేసినట్లు పరిశీలనలో తేలితే తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

**చేతననగర్ ఎగ్జిట్, వజ్ర ఎన్‌క్లేవ్ రోడ్డు నంబరు 4, కావేరి ఎన్‌క్లేవ్, టీఎస్‌ఆర్‌ఆర్ కాలనీ ప్రవేశ మార్గాలతో పాటు అల్వాల్ హిల్స్ రోడ్డు నంబరు 13 మీదుగా 14, 15, 16వ నంబరు రహదారుల వైపు మళ్లుతున్న ట్రాఫిక్‌ను జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులు సంయుక్తంగా పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. బారికేడ్, స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు, ప్రత్యామ్నాయ రహదారుల వెడల్పు, స్కూల్ బస్సుల రాకపోకలు, అత్యవసర వాహనాల ప్రవేశ పరిస్థితిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఒక కాలనీలోని ట్రాఫిక్ సమస్యను పరిష్కరించే క్రమంలో ఇరుగుపొరుగు కాలనీల ఇరుకు రహదారులపై భారం పెరగకుండా, చిన్నారులు, వృద్ధులు, సాధారణ వాహనదారులతో పాటు అత్యవసర సేవలకు ఇబ్బంది కలగకుండా సమగ్ర పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.**

# ఘనంగా సూర్యగిరి ఎల్లమ్మ తల్లి బోనాలు

### ఎల్లమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**మహేశ్వరం,సెప్టెంబర్1(జనంసాక్షి) :** మహేశ్వరం నియోజకవర్గంలోని రావిరాల గ్రామంలో కొలువుదీరిన ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ తల్లి బోనాల ఉత్సవాలను, ఘట్టాల ఊరేగింపును భక్తులు మంగళవారం వైభవంగా నిర్వహించారు.అమ్మవారి దర్శనం కోసం మంగళవారం తెల్లవారుజామున నుంచి భక్తులు బారులు తీరారు. బోనాల ఉత్సవాలల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి,మాజీ ఎమ్మెల్యేలు తీగల కృష్ణారెడ్డి, కెఎల్‌ఆర్ పలు రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో సంస్కృతి,సంప్రదాయాలకు ప్రత్యేకమైన స్థానం ఉందన్నారు.ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.ఈ కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

